PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 302 | విజయవాడ, ఆదివారం 4 జూన్ 2023 | 6+8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 4 June 2023 | Rs

సిటీ◆

బహుళ ధ్రువ ప్రపంచానికి భరోసా

- బ్రిక్స్ కూటమిలోకి మరిన్ని దేశాలు

లోపలి పేజీలో..

ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ప్రధాని మోడీ

ప్రయాణికుల మృతదేహాలు

బాలాసోర్ ప్రమాద స్థలిలో సహాయకచర్యలు

భీతావహం.. హృదయవిదారకం

288కి చేరిన మృతుల సంఖ్య • 900 మందికి గాయాలు

- మరుభూమిని తలపించిన బహనగబజార్ స్టేషన్
- బాధితులకు ప్రధాని మోడీ, ఒడిశా సిఎం నవీన్ పరామర్శ
- వెల్లువెత్తిన మానవతాసాయం
- వేలాది మంది రక్తదానం
- ఘటనాస్థలానికి వివిధ రాష్ట్రాల బృందాలు

చెల్లాచెదురుగా పడిన బోగీలు..రక్తం తడారని రైళ్ల శకలాలు..పట్టాల మధ్యనే తరలించేందుకు సిద్ధం చేసిన మృతదేహాలు..తమవారి కోసం రెప్పవాల్చకుండా వెతుకుతున్న అభాగ్యులు..శనివారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలోనూ ఒడిశాలోని బాలాసోర్ సమీపంలోని బహనగబజార్ స్టేషన్ వద్ద కనిపించిన భీతావహదృశ్యాలివి. ఈ ప్రమాదానికి కారణాలేమిటి? అసలు కారకులెవరు? మానవ తప్పిదమా? సిగ్నల్ వైఫల్యమా అన్నది సమగ్ర విచారణ తర్వాత గానీ తేలదు. ప్రాథమిక విచారణలో తేలినదానిని బట్టి.. సిగ్నలింగ్ వ్యవస్థ వైఫల్యంతో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ గూడ్స్‌ను ఢీకొనడం.. ఆ బోగీలు మరో మెయిన్ ట్రాక్‌లోకి ఒరిగిపోవడం.. ఆ తర్వాత యశ్వంత్‌పూర్ సూపర్ ఫాస్ట్ రైలు ఢీకొనడం వెంటవెంటనే జరిగిపోయాయి. మూడు రైళ్లు ఒకదానికొకటి ఢీకొన్న ఈ ఘోర రైలు విపత్తుతో అంతటా విషాదఛాయలు అలముకున్నాయి. వేలాది మంది అక్కడకు చేరుకున్నారు. అంతులేని దు:ఖంతో ఆ ప్రాంతం మరుభూమిని తలపించింది. బాధితుల ఆర్తనాదాలు, హాహాకారాలతో ఆ ప్రాంతం శోకసంద్రంగా మారింది. ఈ ఘోరకలిలో 300 మందికి పైగా మరణించివుంటారని, క్షతగాత్రులు వెయ్యిమంది పైగా ఉంటారని అంచనా. ఇప్పటి వరకు 288 మంది మరణించారని, మరో 900 మంది గాయపడ్డారని భారతీయ రైల్వే అధికారికంగా ప్రకటించింది. క్షతగాత్రులతో ఆసుపత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. ప్రమాదస్థలిని, ఆ తర్వాత క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ఆసుపత్రులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వెళ్లిన ఉన్నతస్థాయి బృందాలు సందర్శించాయి. ప్రమాదం జరిగిన తీరు గురించి రైల్వేశాఖ, ఎన్‌డిఆర్‌ఎఫ్ ఉన్నతాధికారులు ప్రధానికి వివరించారు. అనంతరం ఆయన ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ ప్రమాదానికి కారణమైన వారు ఎంతటివారైనా కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.

వివరాలు లోపలి పేజీల్లో

రైలు ప్రమాద మృతులకు సిపిఎం పొలిట్‌బ్యూరో సంతాపం 5

పింఛను కోసం వచ్చి... సిక్కోలు వాసి మృతి 2

బాధితుల రక్షణకు అత్యవసర చర్యలు

- ఒడిశా రైలు ప్రమాదంపై సిఎం జగన్ ఉన్నత స్థాయి సమీక్ష
- దుర్ఘటన ప్రాంతానికి మంత్రి అమర్‌నాథ్ నేతృత్వంలో అధికార బృందం

బాలాసోర్ నుంచి విజయవాడ రైల్వే స్టేషన్‌కు శనివారం రాత్రి చేరుకున్న ప్రయాణికులు

ప్రజాశక్తి- అమరావతి, గ్రేటర్ విశాఖ బ్యూరోలు

ఒడిశా రాష్ట్రం బాలాసోర్‌లో రైలు ప్రమాద బాధితుల రక్షణకు అత్యవసర చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ దుర్ఘటనపైన శనివారం ఆయన తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తోపాటు పౌరసరఫరాల శాఖ కమిషనరు హెచ్ అరుణ్‌కుమార్, విశాఖ కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనరు ఆనంద్, శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్ నవీన్‌లతో కూడిన బృందం దుర్ఘటన ప్రాంతానికి వెంటనే బయలుదేరి వెళ్లి సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రమాద సంఘటన గురించి ఒడిశా సిఎంఒకు నిరంతరం టచ్‌లో ఉండాలని అధికారులకు సూచించారు. మృతుల సంఖ్య, క్షతగాత్రుల సంఖ్య కూడా భారీగా ఉందన్నారు. ప్రమాద ఘటనకు సంబంధించి తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని, కలెక్టరేట్లలో హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

బాలాసోర్‌కు 50 ఎపి అంబులెన్సులు
అవసరమైతే నేవీ సహాయం : మంత్రి బొత్స

ప్రమాదం జరిగిన ప్రాంతానికి మన రాష్ట్రం నుంచి 50 అంబులెన్సులను పంపించామని మంత్రి బొత్స తెలిపారు. విశాఖ ఎయిర్ పోర్టులో ఒక ఛాపర్‌ను సిద్ధంగా ఉంచామని మిగతా 2లో

హామీలను నెరవేర్చండి

- కడప, కోనసీమ జిల్లాల్లో కొనసాగిన జాతాలు

మరో 2 రోజులు అధిక ఉష్ణోగ్రతలు

- నేడు 135 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు
- విపత్తుల నిర్వహణ సంస్థ

లోపలి పేజీలో..

పొత్తులపైనే చర్చ!

జెపి నడ్డా, అమిత్ షాలతో చంద్రబాబు భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపి జాతీయాధ్యక్షులు జెపి నడ్డాతోనూ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోనూ టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు భేటీ అయ్యారు. తెలుగు రాష్ట్రాల్లో బిజెపి, టిడిపి మధ్య పొత్తు కుదరనుందన్న కథనాల నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. బిజెపి అధిష్టానమే చంద్రబాబును ఇందుకోసం ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు సమాచారం. దీంతో ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో నడ్డా, అమిత్ షాలతో భేటీ అయ్యారు. ఇరువరి నేతలతో ఆయన దాదాపు 45 నిమిషాల పాటు సమావేశమయ్యారు. రాజకీయ అంశాలపైనే ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది. మరికొన్ని నెలల్లో తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాదిలో ఏపిలో జరిగే సార్వత్రిక ఎన్నికల పొత్తులపైనే ఈ సమావేశంలో దృష్టి సారించినట్లు సమాచారం. తెలంగాణ బిజెపి నేతలు ఇటీవల అమిత్ షా, జెపి నడ్డాతో సమావేశం కావడం, అంతకముందు జనసేన అధినేత పవన్ కల్యాణ్.. జెపి నడ్డాతో సమావేశమైన నేపథ్యంలో తాజాగా చంద్రబాబు భేటీ కావడం విశేషం. గత ఏప్రిల్ నెల 3, 4 తేదీల్లో బిజెపి జాతీయ

నాయకత్వంతో పవన్ భేటీ కాగా, నాటి సమావేశాల్లో బిజెపి, టిడిపి, జనసేన కలిసి ఎన్నికలకు వెళ్తే మంచిదని పవన్ బిజెపి నేతలకు చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బిజెపి, టిడిపి మధ్య రాయబారిగా పవన్ వ్యవహరించారని, ఇప్పుడు చంద్రబాబును కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపించుకోవడం పవన్ రాయబారంలో భాగమేనన్న కథనాలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై చంద్రబాబు కానీ, బిజెపి నేతలు కానీ ఏ విషయమూ చెప్పడం లేదు. ఢిల్లీ వెళ్లిన చంద్రబాబుకు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో టిడిపి ఎంపిలు రామ్మోహన్‌నాయుడు, కేశినేని నాని, కనకమేడల రవీంద్ర కుమార్, వైసిపి ఎంపి రఘురామ కృష్ణరాజు తదితరులు స్వాగతం పలికారు.

పీలేరు చిత్తూరు మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన తుఫాన్ వాహనం

రోడ్లు రక్తసిక్తం

- వేర్వేరు ప్రమాదాల్లో తొమ్మిది మంది మృతి

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలోని శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తొమ్మిది మంది మృతి చెందారు. వీరిలో జిల్లా కేంద్రమైన నంద్యాలకు చెందిన నలుగురు, అన్నమయ్య జిల్లాకు చెందిన ముగ్గురు, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఇద్దరు ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం... నంద్యాలకు 12 మంది యాత్రికులు అన్నమయ్య జిల్లా తిరువన్నామలైలో పౌర్ణమి సందర్భంగా జరిగే గిరిప్రదక్షిణలో పాల్గొనేందుకు తుఫాన్ వాహనంలో శుక్రవారం రాత్రి 10.30 గంటలకు బయలుదేరారు. రోడ్డుపై ఆగి ఉన్న లారీని శనివారం తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో పీలేరు పట్టణ శివారులోని ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సమీపంలో వారి వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చింతల ప్రతాప్‌రెడ్డి (43), వందల విమల (52), నేతి లక్ష్మీదేవి (58), శివమ్మ (44) ఘటనా అక్కడికక్కడే మృతి చెందారు. ఎనిమిది గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పీలేరు-మదనపల్లి రహదారిలోని కొండారెడ్డి మిషన్ మలుపులో లగేజ్ వాహనాన్ని కర్ణాటక ఆర్‌టిసి బస్సు ఢీకొంది. ఈ మిగతా 2లో

సిబిఐ విచారణకు అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి శనివారం సిబిఐ అధికారుల ముందు విచారణకు హాజరయ్యారు. అవినాష్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ప్రతి శనివారం సిబిఐ విచారణకు హాజరు కావాలని తెలంగాణ హైకోర్టు షరతు విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 9.40 గంటలకు ఆయన తన న్యాయవాదితో కలిసి కోఠిలోని సిబిఐ కార్యాలయానికి వచ్చారు. అవినాష్‌రెడ్డి ఒక్కరినే విచారణ హాలులోకి సిబిఐ అనుమతించింది. ఉదయం 10.30 గంటలకు విచారణ ప్రారంభించిన సిబిఐ అధికారులు సాయంత్రం 5.30 గంటల వరకు ప్రశ్నించారు. ఆయన ఉపయోగిస్తున్న సెల్ ఫోన్లలోని డేటాను సిబిఐ అధికారులు సేకరించినట్లు తెలిసింది. వివేకా హత్య జరిగిన రోజు అర్ధరాత్రి ఎవరెవరితో మాట్లాడారనే విషయాలను అధికారులు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

బ్రిజ్ భూషణ్ వేధింపులు వాస్తవమే

- ఢిల్లీ పోలీసులకు సాక్షుల వాంగ్మూలం
- సాక్షుల్లో ఇద్దరు రెజ్లర్లు, అంతర్జాతీయ రిఫరీ, కోచ్
- 4 రాష్ట్రాల్లో మొత్తం 125 మంది సాక్షులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రెజ్లర్లను బిజెపి ఎంపి, డబ్ల్యుఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ లైంగికంగా వేధించడం వాస్తవమేనని నలుగురు సాక్షులు ధ్రువీకరించారు. ఆ సాక్షుల్లో ఇద్దరు రెజ్లర్లు, ఒక టాప్ రిఫరీ, ఒక రాష్ట్ర కోచ్ ఉన్నారు. సంఘటన జరిగిన ఆరు గంటల తరువాత తనను పిలిచారని కోచ్ చెప్పారు. ఆరోపణల గురించి తెలుసునని రిఫరీ తెలిపారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షులు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై కనీసం ముగ్గురు మహిళా రెజ్లర్ల ఆరోపణలను ఒక ఒలింపియన్, ఒక కామన్వెల్త్ బంగారు పతక విజేత, అంతర్జాతీయ రిఫరీ, రాష్ట్ర స్థాయి కోచ్ ధ్రువీకరించారు. 4 రాష్ట్రాల్లోని 125 మంది సాక్షుల వాంగ్మూలాలను ఢిల్లీ పోలీసులు నమోదు చేశారు. వారిలో ఈ నలుగురు ఉన్నారు.

ఏప్రిల్ 28న ఢిల్లీ పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసిన తరువాత సాక్షులను విచారించారు. వృత్తిపరమైన సహాయానికి బదులుగా 'లైంగిక ప్రయోజనాలను' కోరిన కనీసం రెండు సందర్భాలు ఉన్నాయని తెలిపారు. దాదాపు 15 లైంగిక వేధింపుల సంఘటనలు, ఇందులో 10 ఎపిసోడ్‌లు అనుచితంగా తాకడం, వేధింపులు రొమ్ములపై చేతులు వేయడం, నాభిని తాకడం, వెంబడించడంతో సహా బెదిరింపులకు సంబంధించిన అనేక సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ఈ నలుగురు సాక్షుల గురించి అడిగినప్పుడు, ఢిల్లీ పోలీసు ప్రతినిధి సుమన్ నల్వా 'ఈ కేసులో దర్యాప్తు, సాక్ష్యం ఏమిటనే దానిపై మేము వ్యాఖ్యానించలేము. విచారణ ఇంకా కొనసాగుతోంది. దీనిపై సిట్ విచారణ చేపట్టి నివేదికను కోర్టుకు అందజేస్తుంది' అని అన్నారు.

బ్రిజ్ భూషణ్ వేధింపుల ఘటన జరిగిన ఆరు గంటలకు దాని గురించి రెజ్లర్ తనకు ఫోన్‌లో తెలియజేసినట్లు ఫిర్యాదుదారుల్లో ఒకరి కోచ్ చెప్పినట్లు తెలిసింది. ఇద్దరు మహిళా రెజ్లర్లను ఢిల్లీ పోలీసులు ప్రశ్నించినప్పుడు వారి వాదనను ధ్రువీకరించారు. వారి వాంగ్మూలాలలో లైంగిక వేధింపుల సంఘటనలు జరిగిన ఒక నెల తరువాత ఫిర్యాదుదారు తమకు తెలియజేసినట్లు వారు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ సర్క్యూట్‌లో పేరున్న రిఫరీ, తాను స్వదేశంలో, విదేశాలలో టోర్నమెంట్లకు వెళ్లినప్పుడు మహిళా రెజ్లర్ల కష్టాల గురించి తాను విన్నానని ఢిల్లీ పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. ఢిల్లీ పోలీసులు మహిళా పోలీసు సిబ్బందితో సహా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. లైంగిక వేధింపుల సంఘటనలు జరిగినట్లు ఆరోపించబడిన టోర్నమెంట్‌కు హాజరైన వారి గురించి డబ్ల్యుఎఫ్ఐ నుంచి వివరాలు కోరింది. సింగ్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఫిర్యాదులపై దర్యాప్తు చేసేందుకు బాక్సర్ మేరీకోమ్ అధ్యక్షతన ప్రభుత్వం నియమించిన పర్యవేక్షణ కమిటీ నివేదికను కూడా పోలీసులు సేకరించారు. సిట్ 158 మంది వ్యక్తుల జాబితాను సిద్ధం చేసింది. వారు హర్యానా, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటకను మిగతా 5లో

రైలొచ్చినా గేటు వేయలేదు..!

- స్థానికుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-కదిరి అర్బన్

శ్రీ సత్యసాయి జిల్లాలో పెనుప్రమాదం తప్పింది. రైలు వస్తున్న శుక్రవారం రాత్రి కదిరి పట్టణ సమీపంలోని కుటాగుళ్ల రైల్వే గేటును వేయలేదు. ప్రయాణికుల అప్రమత్తతో పెనుప్రమాదం తప్పింది. ఇందుకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం..కదిరి పట్టణం కుటాగుళ్ల వద్ద రైల్వే గేటు ఉంది. ఈ మార్గంలో తిరుపతి-చెన్నై వైపునకు నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో రైలు వస్తున్న సమయంలో గేట్ వేయకుండా రైల్వే ఉద్యోగి నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. ట్రాక్‌పై వాహనాలు తిరుగుతున్న సమయంలో ఒక్కసారిగా నాగర్ కోయిల్-చెన్నై రైలు దూసుకొచ్చింది. ఆ సమయంలో ట్రాక్‌పై వాహనాలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. గేట్ వేయకపోవడాన్ని గమనించిన లోకో పైలెట్ కొంతదూరం వెళ్లాక రైలును నిలిపేశాడు. ఈ ఘటనపై రైల్వే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాడు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న రైల్వే ఉన్నతాధికారులు గేట్‌మెన్‌ను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ప్రభుత్వ ఉద్యోగులపై కక్షసాధింపు

- టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజ్యాంగం కల్పించిన హక్కులను జగన్ ప్రభుత్వం హరిస్తోందని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటాన్ని టిడిపి ఖండిస్తోందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్ నియంతృత్వ పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి జీతభత్యాలు అందేలా చట్టం చేయాలని కోరుతూ ఉద్యోగుల సంఘం నాయకులు గవర్నరును కలిసినందుకు వారిపై వేధింపు చర్యలకు ప్రభుత్వం దిగుతోందని అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఫైనాన్షియల్ కోడ్‌లోని 72వ నిబంధన ప్రకారం ఉద్యోగులు, పెన్షన్లు, ఇతర క్లెయిమ్స్‌ను మొదటి హక్కుదారులుగా చేర్చాలని గవర్నరును కోరడం నేరమా? అని ప్రశ్నించారు. ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సూర్యనారాయణతోపాటు మిగిలిన సభ్యులపై పోలీసులను అడ్డంపెట్టుకుని అక్రమ కేసులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

6న తిరుపతిలో 'ఆదిపురుష్' ప్రీరిలీజ్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రామాయణం ఆధారంగా తెరకెక్కిన 'ఆదిపురుష్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను తిరుపతిలో నిర్వహించనున్నారు. వెంటకేశ్వర యూనివర్సిటీ స్టేడియంలో ఆరవ తేదీ సాయంత్రం ఐదు గంటలకు ఈవెంట్ ప్రారంభవుతుందని మేకర్స్ అనౌన్స్ చేశారు. తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కిన ఈ సినిమాను టి సిరీస్ సంస్థ, రిట్రో ఫైల్స్ రూ. 500 కోట్ల భారీ బడ్జెట్ తో సంయుక్తంగా నిర్మించాయి. ప్రభాస్ రాముడిగా, కృతి సనన్ సీత పాత్రలో నటించిన విషయం తెలిసిందే.

రోడ్లు రక్తసిక్తం

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాదంలో పీలేరుకు చెందిన ముబారక్ ఇర్షాద్ (29) సంఘటన స్థలంలోనూ, తీవ్రంగా గాయపడిన

విజయ్ కుమార్ (52) పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలోనూ మృతి చెందారు.

తిరుపతిలో వైద్యం చేయించుకుని తన సన్నిహిడుతో కలిసి ద్విచక్ర వాహనంపై అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం వెలిగల్లు పంచాయతీ ఇందుకూరు వాండ్లపల్లికి చెందిన కృష్ణయ్య (50) వస్తున్నారు. పీలేరు మండలం పొంతల చెరువు క్రాస్ సమీపంలో వారి వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు.

పార్వతీపుం మన్యం జిల్లా పాలకొండకు చెందిన బొద్దాన లక్ష్మి (51) సొంతపనిమీద వెళ్తుండగా పాలకొండ మండలం అన్నవరం ప్రాంతంలో సినిమా థియేటర్ ఎదురుగా లారీ ఢీకొట్టింది. దీంతో, ఆమె అక్కడికక్కడే మృతి చెందారు.

పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురం వెళు తున్న ఆర్‌టిసి బస్సు పార్వతీపురంలోని కన్యకా పరమేశ్వరి గుడి ఎదురుగా టివిఎస్ ఎక్స్‌ఎల్‌ను ఢీకొంది. దీంతో, ఎక్స్‌ఎల్‌ను నడుపుతున్న పార్వతీపురానికి చెందిన వృద్ధునికి గాయాలయ్యాయి. వెనుక కూర్చొన్న ఆయన మనవడు సొండి హర్షత్ (3) అక్కడికక్కడే మృతి చెందాడు.

భయంతో పరుగులు తీశాం

ఘటనపై ప్రత్యక్ష సాక్షుల కథనం

ఒడిశాలోని బాలాసోర్ జిల్లా బహనగ హైస్కూలులో ఉంచిన మృతదేహాలు

ప్రత్యేక రైలులో విశాఖకు వచ్చిన రైలు ప్రమాద క్షతగాత్రుడిని సెవెన్ హిల్స్ ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-యంత్రాంగం

'చాలా భయం వేసింది. ఒక్కసారిగా వచ్చిన పెద్ద శబ్దానికి అందరమూ భయంతో పరుగులు తీశాం. కొద్దిసేపటికి మేము మా బ్యాగులు తీసుకొని బయటికి వచ్చేశాం. అక్కడ ఏం జరుగుతుందో కూడా తెలియని పరిస్థితిలో మేమున్నాము. రైలు ప్రమాదంలో ఎన్ని రైళ్లు ఢీకొన్నయన్నది కూడా మాకు తెలియలేదు. కొద్దిసేపటికి రైల్వే అధికారులు, అంబులెన్సులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను భువనేశ్వర్ ఆస్పత్రికి తరలించారు. నేను మాత్రం ఒంటరిగా కిలోమీటరు దూరం నడిచి వెళ్లాను. అక్కడ నుండి బస్సులో భువనేశ్వర్ చేరుకున్నాను. అక్కడ నుంచి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ఏలూరు వచ్చాను' అంటూ... ఏలూరుకు చెందిన పిల్లి శ్రీకర్‌బాబు తన భయానక అనుభవాన్ని మీడియాకు తెలియజేశారు. ఏలూరు పట్టణంలోని లక్ష్మీనగర్ ప్రాంతానికి చెందిన ఆయన కోల్‌కత్తాలో ఇండియన్ స్టాటికల్ ఇన్‌స్టిట్యూట్‌లో బ్యాచిలర్ ఆఫ్ స్టాటస్టిక్స్ డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నారు. సెలవులు ఇవ్వడంతో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో ఏలూరు వచ్చేందుకు శుక్రవారం మధ్యాహ్నం షాలిమార్‌లో ఎక్కాడు. రాజమండ్రికి చెందిన సీనియర్లు అదే రైలులో ఉన్నారు. సీనియర్ గోరక్ చందుపాల్‌కు గాయాలు కావడంతో భువనేశ్వర్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

స్వల్ప గాయాలతో బయటపడ్డాం

'మేమంతా బి-5 ఎసి బోగీలో ప్రయాణిస్తున్నాం. ఒక్కసారిగా బోగీలు పల్టీలు కొట్టాయి. మా బోగీ మాత్రం కుదుపునకు గురైంది. స్వల్పగాయాలతో బయటపడ్డాం' అని పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం కొత్త పనుకువలసకు చెందిన కాదూరి లోకేష్, ఆయన తల్లి అక్కమ్మ, భార్య విన్ని, పిల్లలు హేమంత్, కరిష్మా తెలిపారు. వీరంతా కోల్‌కత్తా నుంచి కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ వస్తున్నారు. ప్రథమ చికిత్స అనంతరం ప్రత్యేక రైలులో రైల్వే అధికారులు వారిని విశాఖ తీసుకొచ్చారు.

తిరుపతి వాసులంతా క్షేమం

తిరుపతి స్టేషన్ నుంచి 18 మంది, రేణిగుంట నుంచి 8 మంది, గూడూరు నుంచి ఇద్దరు కలిపి మొత్తం 28 మంది కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారని తిరుపతి ఎంపి గురుమూర్తి తెలిపారు. వీరంతా సురక్షితంగా ఉన్నారని ఆయన చెప్పారు.

విశాఖ జిల్లా యంత్రాంగం, రైల్వే అధికారుల మధ్య సమన్వయ లోపం

విశాఖకు చెందిన వారు ఫస్ట్ ఎసిలో ముగ్గురు, సెకండ్ ఎసిలో 14 మంది, థర్డ్ ఎసిలో 71 మంది, స్లీపర్ క్లాస్‌లో 22 మంది వెరసి 110 ప్రయాణిస్తున్నారని రైల్వే శాఖ అధికారులు తెలియజేయగా, విశాఖపట్నం కలెక్టరేట్‌లో ఎపి విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇచ్చిన గణాంకాలు దానికి భిన్నంగా ఉన్నాయి.

సరైన సమాచారం లేదు

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి సంబంధించి అన్ని రైల్వే స్టేషన్లలోనూ హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేసినప్పటికీ ఎక్కడా సరైన సమాచారం లభించడం లేదు. ఏయే రైళ్లు రద్దు అయ్యాయి? ఏ రైలు ఎప్పుడు వస్తుంది? అనే సమాచారం కూడా లభించలేదు. దీంతో, శుక్రవారం రాత్రి నుంచి వందలాది మంది ప్రయాణికులు విశాఖతో పాటు పలు రైల్వే స్టేషన్లలో ఇబ్బందులు పడ్డారు విశాఖపట్నానికి చెందిన వారు ఎంతమంది రిజర్వేషన్ చేసుకున్నారనే వివరాలు తప్ప, మరే ఇతర వివరాలూ అధికారుల వద్ద లేవు. స్వల్ప గాయాలతో బయటపడిన 245 మందితో బయలుదేరిన ప్రత్యేక రైలు నుంచి విశాఖలో పది మంది మాత్రమే దిగారు. వారిని ప్రధాన మార్గం నుంచి కాకుండా పక్క మార్గం నుంచి రైల్వే అధికారులు తరలించడంపై విమర్శలు వస్తున్నాయి.

మత్స్యకారుడు మృతి

ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా జగన్నాథపురానికి చెందిన వలస మత్స్యకారుడు మృతి చెందారు. ఆయన కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... ఉపాధి నిమిత్తం ఒడిశాలోని బాలేశ్వర్‌కు చోడిపల్లి గురుమూర్తి (63) వలస వెళ్లారు. ప్రతి నెలా వృద్ధాప్య పింఛను కోసం గ్రామానికి వస్తుంటారు. పింఛను తీసుకుని ఈ నెల రెండో తేదీన కోటబొమ్మాళి రైల్వేస్టేషన్‌లో విశాఖ ఎక్స్‌ప్రెస్ ఎక్కి భువనేశ్వర్‌లో దిగారు. అక్కడ నుంచి బాలేశ్వర్‌కు యశ్వంతపూర్ రైలు ఎక్కారు. ఈ రైలు ప్రమాదానికి గురి కావడంతో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇదే రైలులో ప్రయాణిస్తున్న సంతబొమ్మాళి మండలానికి చెందిన యల్లమ్మకు రెండు చేతులూ విరిగిపోయాయి. ప్రస్తుతం ఆమె భువనేశ్వరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన మైలపల్లి రాజేశ్వరి స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

హెల్త్ సెక్రటరీలకు బదిలీల్లో న్యాయం చేయాలి

సిఎస్‌కు యుహెచ్‌ఎస్‌ఎ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సెక్రటేరియట్లో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలకు బదిలీల్లో న్యాయం చేయాలని, బదిలీల అప్లికేషన్స్‌లో 'అదర్స్' ఆప్షన్ ఇవ్వాలని, రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్స్‌కు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి యునైటెడ్ విలేజ్ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (యుహెచ్‌ఎస్‌ఎ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఎస్ జవహర్‌రెడ్డికి అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె అన్నమ్మ, అధ్యక్షులు ఎ మాధవి, ప్రధాన కార్యదర్శి బి ప్రభారాణి శనివారం లేఖ రాశారు. ప్రస్తుతం రిలీజ్ చేసిన ఉత్తర్వుల ప్రకారం గ్రామ, వార్డు సచివాలయం బదిలీల విషయంలో హెల్త్ సెక్రటేరియట్లకు తీరని అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. సచివాలయాల్లోని ఇతర డిపార్టుమెంట్ల సచివాలయ ఉద్యోగులకు ఇచ్చిన విధంగా హెల్త్ సెక్రటరీలకు మెడికల్ గ్రౌండ్, విడో, మ్యూచువల్స్ అంతర్ జిల్లాల బదిలీలు, అదర్స్ ఆప్షన్ కల్పించాలని వారు లేఖలో విజ్ఞప్తి చేశారు.

టెక్నాలజీకి అనుగుణంగా బోధన

- ఉన్నత విద్యామండలి వార్షికోత్సవంలో బివిఆర్ మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా బోధన ఉండాలని సైంట్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ బివిఆర్ మోహన్ రెడ్డి అన్నారు. అందుకు తగ్గట్టుగా తరగతిలో మార్పులు రావాలని కోరారు. ఎపి ఉన్నత విద్యామండలి 36వ వార్షికోత్సవ వేడుకలు విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం జరిగాయి. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె హేమచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్య ఎల్లప్పుడూ మారుతోందని, విద్యార్థుల ఆలోచనలు కూడా మారుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం టెక్నాలజీ ఆధారిత ఉద్యోగాలు పెరిగాయని, భవిష్యత్‌లో కూడా ఇంకా పెరుగుతాయని అన్నారు. రాబోయే పదేళ్లలో 10 కోట్ల మంది విద్యార్థులు తమ విద్యను పూర్తి చేసుకుని బయటకు వస్తారని చెప్పారు. మారుతున్న టెక్నాలజీకి ఆధారంగా బోధన కోర్సులు ఉంటేనే వీరికి ఉద్యోగాలు కల్పించగలమని చెప్పారు.

ఉన్నత విద్యామండలి మాజీ ఛైర్మన్ ఎల్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో 70 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రానున్న కాలంలో వీటిని భర్తీ చేయకపోతే యూనివర్సిటీలను నడపడం సాధ్యం కాదన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో ఎక్కువకాలం నడపలేమని చెప్పారు. రెగ్యులర్ పోస్టుల భర్తీపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర విభజన సమయంలో ఉన్నత విద్యామండలి పలు ఇబ్బందులు ఎదుర్కొందని, కనీసం ఉండేందుకు కార్యాలయం కూడా లేదని గుర్తుచేశారు. విద్యాశాఖ సలహాదారు ఎ సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లాకు ఒక యూనివర్సిటీని తీసుకురావడమే తమ లక్ష్యమని చెప్పారు. గత నాలుగేళ్లలో ఉన్నత విద్యలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు.

ఎపి స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎమ్‌డి వినోద్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో స్కిల్ పెరిగేందుకు అనేక చర్యలను తీసుకుంటున్నామని చెప్పారు. ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్ అహ్మద్ వందన సమర్పణ చేసిన ఈ కార్యక్రమంలో ఎస్ మాధ్యూ, సెట్ల ప్రత్యేక అధికారి సుధీర్ రెడ్డి, అకడమిక్ సెల్ సెలీనా, ఉన్నత విద్యామండలి వైస్‌ఛైర్మన్ కె.రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' పోరాటం.. స్ఫూర్తిదాయకం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం రెండేళ్లకుపైగా సాగుతున్న పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 842వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ టిపిపి, పిఎంఇ, స్టోర్స్, ఆర్ఇడి, ఇఎండి విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయా విభాగాల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల మనుగడకు మోడీ ప్రభుత్వ హయాంలో ప్రమాదం పొంచి ఉందని, ఈ నేపథ్యంలో అకుంఠిత దీక్షతో సాగుతున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటం ఎంతో మందిలో స్ఫూర్తినింపుతోందని తెలిపారు. ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ స్టీల్‌ప్లాంట్ కార్మికుల పోరాటం గురించి చర్చ జరుగుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

శిక్షను నేరుగా తగ్గించే అధికారం ట్రిబ్యునల్‌కు లేదు : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

విధి నిర్వహణలో తప్పు చేసిన ఉద్యోగికి క్రమశిక్షణాధికారి విధించిన శిక్షను పరిపాలనా ట్రిబ్యునల్ మార్పు చేయడానికి వీల్లేదని హైకోర్టు తీర్పు చెప్పింది. అధికారి విధించిన శిక్ష తీవ్రంగా ఉందనే నిర్ణయానికి వస్తే శిక్ష తగ్గించాలని ఆ అధికారికి ఆదేశాలు జారీ చేయాలే గానీ, నేరుగా ట్రిబ్యునల్ శిక్షను తగ్గించేందుకు వీల్లేదని స్పష్టం చేసింది. ఒక కానిస్టేబుల్‌కు క్రమశిక్షాణాధికారి విధించిన శిక్షను ట్రిబ్యునల్ తగ్గించడాన్ని తప్పుపడుతూ న్యాయమూర్తులు సిహెచ్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ వి గోపాలకృష్ణారావుతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది.

1984లో పోలీసు కానిస్టేబుల్‌గా నియమితులైన విశాఖకు చెందిన మురహరిరావు విధి నిర్వహణలో అనేక ఆరోపణలు వచ్చాయి. ఎస్ఐనని చెప్పుకుంటూ భూపాల్ చంద్ అనే వ్యక్తి నుంచి రూ.5 వేలు వసూలు చేశారు. హన్మంతరావు అనే వ్యక్తి ఇంట్లోకి చొరబడి తనిఖీలు నిర్వహించి ఎక్సైజ్ కేసులో ఇరికిస్తానని బెదిరించి డబ్బు డిమాండ్ చేశారు. ఇలాంటి ఇతర ఆరోపణలపై విచారణ జరిపి నివేదికపై అధికారులు అతని వివరణ కోరారు. రిప్లైతో సంతృప్తి చెందని అధికారులు 1999లో అతని టైం స్కేల్‌లో పర్మినెంట్‌గా కోత విధించారు. దీనిపై 2002లో ఎపి పరిపాలన ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. ఆరోపణలు వాస్తవమేనని అంగీకరిస్తూ టైం స్కేల్‌లో కోతను కొంత తగ్గించింది. దీనితోపాటు సీనియార్టీ, పెన్షన్ ఇతర ప్రయోజనాల నిమిత్తం సస్పెన్షన్ కాలాన్ని డ్యూటీలో ఉన్నట్లు పరిగణించాలని ట్రిబ్యునల్ 2009లో తీర్పు చెప్పింది. దీనిని మురహరిరావు హైకోర్టులో సవాల్ చేస్తే 2009లో కొట్టేసింది. ఇదే సమయంలో అతనికి విధించిన శిక్షను ట్రిబ్యునల్ తగ్గించడాన్ని హోంశాఖ హైకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై హైకోర్టు పైవిధంగా తీర్పు చెప్పింది.

మరో 2 రోజులు అధిక ఉష్ణోగ్రతలు

- నేడు 135 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు
- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మరో రెండు రోజులు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టరు బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 4న అల్లూరి జిల్లాలోని చింతూరు, కృష్ణా జిల్లాలోని ఉయ్యూరులో తీవ్ర వడగాడ్పులు, మరో 135 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 5న రాష్ట్ర వ్యాప్తంగా 8 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 268 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం చూపిస్తాయన్నారు. ఈ నెల 3న పల్నాడు జిల్లా రావిపాడులో 45.6 డిగ్రీల ఉష్ణోగ్రత, గుంటూరు జిల్లా మంగళగిరి, తూర్పుగోదావరి జిల్లా పేరవలి, బాపట్ల జిల్లా వేమూరు, మన్యం జిల్లా పేదమేరంగిలో 45.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అన్నారు. 14 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 143 మండలాల్లో వడగాడ్పులు వీచినట్లు తెలిపారు. ఈ నెల 4న విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 44 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. కోనసీమ, పశ్చిమగోదావరి, కర్నూలు, నంద్యాల, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42 డిగ్రీల నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని తెలిపారు. శ్రీకాకుళం, విశాఖ, అనకాపల్లి, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 39 నుంచి 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని పేర్కొన్నారు.

బాధితుల రక్షణకు అత్యవసర చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. అవసరమైతే నేవీ సహాయం తీసుకోవాలని విశాఖ జిల్లా కలెక్టర్‌కు సూచించామని తెలిపారు. శనివారం సాయంత్రం విశాఖ కలెక్టరేట్‌లో మంత్రులు జోగి రమేష్, కారుమూరి వెంకట నాగేశ్వరరావులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున నేతృత్వంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బొత్స మాట్లాడారు. ప్రమాదానికి గురైన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో 482 మంది తెలుగువారు ప్రయాణం చేస్తున్నారని, వీరిలో 267 మంది సురక్షితంగా ఉన్నారని తేలిందన్నారు. 20 మందికి స్వల్పగాయాలయ్యాయని, 82 మంది ప్రయాణికులు ప్రయాణాలను రద్దు చేసుకున్నారని వెల్లడైందని తెలిపారు. 113 మంది ఫోన్లు ఎత్తకపోవడమో లేదా స్విచ్ఛాఫ్ చేయడమో జరిగిందని తెలిపారు. విశాఖలో దిగాల్సిన వారు 309 వరకూ ఉన్నారని, వారిలో 165 మంది సురక్షితంగా ఉన్నట్లు వెల్లడైందని చెప్పారు. రాజమండ్రిలో దిగాల్సిన వారు 31 మంది, ఏలూరులో దిగాల్సిన వారు ఐదుగురు, విజయవాడలో దిగాల్సిన వారు 137 మంది ఉన్నారని, వీరి ఫోన్ నెంబర్ల ఆధారంగా ట్రేస్ చేస్తున్నామని తెలిపారు. హౌరా వెళు తున్న యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో రాష్ట్రం నుంచి 89 మంది రిజర్వేషన్లు చేయించుకున్నారని చెప్పారు. వారిలో విశాఖలో దిగాల్సిన వారు 33 మంది, రాజమండ్రిలో దిగాల్సిన వారు ముగ్గురు, ఏలూరులో దిగాల్సిన వారు ఒకరు, విజయవాడలో దిగాల్సిన వారు 41 మంది, బాపట్లలో దిగాల్సిన వారు ఎనిమిది మంది, నెల్లూరులో దిగాల్సిన వారు ముగ్గురు ఉన్నారని చెప్పారు. వారిలో 49 మంది సురక్షితంగా ఉన్నారని, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు. పదిమంది రైలు ఎక్కలేదని, 28 మంది ఫోన్లు ఎత్తలేదని చెప్పారు. ఇచ్ఛాపురం నుంచి ఒంగోలు వరకు ఆస్పత్రులను అలర్ట్ చేశామని తెలిపారు. ఆదివారానికి పూర్తి సమాచారం వస్తుందని చెప్పారు. ఒడిశాలో కూడా తెలుగు ప్రజలకు ట్రీట్‌మెంట్ కోసం భువనేశ్వర్, కటక్‌లలో అపోలో సహా మరో రెండు కార్పొరేట్ ఆస్పత్రుల్లో సేవలందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత గంట గంటకూ సిఎం జగన్ సమీక్ష నిర్వహిస్తున్నారని చెప్పారు. 50 మంది తాము ప్రయాణం చేయలేదని సమాచారమిచ్చారని తెలిపారు. 76 మందిని గుర్తించాల్సి ఉందని బొత్స సహా ఒడిశా నుంచి మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. అవసరమైతే ఎయిర్ అంబులెన్సులను ఏర్పాటు చేసుకోవాలని సిఎం వైఎస్ జగన్ ఆదేశించినట్లు అమర్‌నాథ్ చెప్పారు. ఆచూకీ దొరకని వారిని కనుగొనేందుకు ఒడిశాలో తమ బృందం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు.

విశాఖ సెవెన్ హిల్స్‌లో ఇద్దరు చికిత్స

భువనేశ్వర్ నుంచి విశాఖ వస్తూ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదంలో గాయపడిన విశాఖ జిల్లా మారికవలసకు చెందిన భార్యాభర్తలు లోకేష్, బిన్నీ... విశాఖలోని సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తలపై ఒకరికి గాయం అయ్యిందని మంత్రి బొత్స తెలిపారు. మరొకరికి వెనుక భాగంలో దెబ్బ తగిలిందని చెప్పారు.

24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు : విపత్తుల నిర్వహణసంస్థ

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాద సంఘటనలో కనబడకుండాపోయిన లేదా క్షతగాత్రుల సమాచారం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ రాష్ట్ర అత్యవసర ఆపరేషన్ సెంటర్‌లో 24/7 అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేర్కొన్నారు. సమాచారం కోసం 1070, 112, 18004250101 ఫోన్ చేయాలని సూచించారు. బంధువులు, స్నేహితులు కనిపించకుండాపోతే సమాచారం కోసం 8333905022 వాట్సాప్ నెంబరుకు ప్రయాణికుని ఫొటో, ఇతర వివరాలు పంపించాలని కోరారు. ఎప్పటికప్పుడు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు వివరాలు తెలియజేస్తామని పేర్కొన్నారు.

రైల్వే హెల్ప్ లైన్ నెంబర్లు
హౌరా :033 2638227
ఖరగ్‌పూర్ : 8972073925, 9332392339
బాలాసోర్: 8249591559, 7978418322, 8585039521
షాలిమార్ : 9903370746
సంత్రాగచ్చి: 8109289460, 8340649469
విజయవాడ రైల్వే డివిజన్ హెల్ప్ లైన్ నెంబర్లు:
విజయవాడరైల్వే స్టేషన్ :0866 2576924
రాజమండ్రి : 0883 2420541
నెల్లూరు రైల్వే స్టేషన్: 0861 2342028
సమల్కోట్ రైల్వే స్టేషన్ : 7780741268
ఒంగోలు : 7815909489
బాపట్ల : 08643 222178
తెనాలి : 08644 227600
తాడేపల్లి గూడెం :08818 226162
గూడూరు : 08642 250795
ఏలూరు : 08812 232267
దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసిన రైళ్లు:
రద్దు చేయబడిన రైళ్లు : 23
దారి మళ్లించిన రైళ్లు : 26
రీషెడ్యూల్ : 1
షార్ట్ టెర్మినేటెడ్ : 2

పలు రైళ్లు రద్దు

ఒడిశాలోని బాలాసోర్ వద్ద జరిగిన రైళ్ల ప్రమాద దుర్ఘటన నేపథ్యంలో ఆ మార్గంలో ప్రయాణించాల్సిన పలు రైళ్లను రద్దు చేస్తున్నట్టు రైల్వే శాఖ తెలిపింది. 12839 హౌరా - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్, 12842 చెన్నై సెంట్రల్ - షాలిమార్, 12509 ఎస్ఎంవి బెంగళూరు - గౌహతి ఎక్స్‌ప్రెస్, 22606 విల్లుపురం - పురేలియా ఎక్స్‌ప్రెస్, 22641 త్రివేండ్రం - షాలిమార్ ఎక్స్‌ప్రెస్, 12551 ఎస్ఎంవి బెంగళూరు - కామాఖ్య ఎక్స్‌ప్రెస్, 12864 ఎస్ఎంవి బెంగళూరు - హౌరా, 12253 ఎస్ఎంవి బెంగళూరు - భాగల్పూర్ ఎక్స్‌ప్రెస్, 18046 హైదరాబాద్ - షాలిమార్, 12704 సికింద్రాబాద్ - హౌరా ఫలక్‌నామా, 12703 హౌరా - సికింద్రాబాద్ ఫలక్‌నామా, 12245 హౌరా - ఎస్ఎంవి బెంగళూరు దురంతో ఎక్స్‌ప్రెస్, 18045 షాలిమార్ - హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 20889 హౌరా - తిరుపతి, 12666 కన్యాకుమారి - హౌరా ఎక్స్‌ప్రెస్, 20890 తిరుపతి - హౌరా ఎక్స్‌ప్రెస్, 22641 త్రివేండ్రం - షాలిమార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది.

9 గంటలకు విజయవాడ చేరుకున్న ప్రత్యేక రైలు

భువనేశ్వర్ నుంచి చెన్నై సెంట్రల్‌కు ట్రైన్ నెంబరు పి/13671 ఒడిశాలో రైలు దుర్ఘటన జరిగిన ప్రాంతం నుంచి శనివారం బయలుదేరింది. ఈ ట్రైన్‌లో సుమారు 250 మంది ప్రయాణికులు ఉన్నారని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. ఈ రైలు విజయవాడకు రాత్రి 9 గంటలకు 6వ నెంబరు ప్లాట్ ఫారమ్‌కు చేరుకుంది. భువనేశ్వర్ నుంచి చెన్నై సెంట్రల్‌కు ట్రైన్ నెంబరు పి/13671 ఒడిశాలో రైలు దుర్ఘటన జరిగిన ప్రాంతం నుంచి శనివారం బయలు దేరిన రైలు విజయవాడకు రాత్రి 9 గంటలకు 6వ నెంబరు ప్లాట్ ఫారమ్‌కు చేరుకుంది. ఆ రైలులో సుశాంత్‌కుమార్‌దాస్, మహుల్ దాస్, మందిరదాస్, రఘుబాబు, బిందుశ్రీ, రాంబాబు, మానస, బిశ్వాస్ లక్ష్మి, అబు కాశిమ్ లస్కర్, హృదయానంద్ ఉన్నారని విజయవాడ రైల్వే అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయానికి చెన్నై సెంట్రల్‌కు ప్రత్యేక రైలు చేరనుంది.

గవర్నర్, సిఎం, చంద్రబాబు, పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి

ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంపై రాష్ట్ర గవర్నరు జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వేర్వేరు ప్రకటనల్లో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఇన్‌సాల్వెన్సీ మరియు బ్యాంక్రప్టసీ కోడ్, 2016 క్రింద ఆస్థులు అమ్మకానికి ఇ-వేలం ప్రకటన

మెసర్స్ నితిన్ గ్రైన్స్ & మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్
(CIN: U15400AP2014PTC095200)
18-3-60/సి, రోడ్ నెం. 2, శ్రీహరి కాలనీ, శాంతినగర్, తిరుపతి-517501, ఆంధ్రప్రదేశ్
మెసర్స్ నితిన్ న్యూట్రిషన్స్ ప్రైవేట్ లిమిటెడ్
(CIN : U15122AP2014PTC095051)
18-3-60/సి, సాయి శ్రవంతి కళ్యాణమండపం, ఖాదీ కాలనీ, తిరుపతి, ఏ.పి.-517501 IN
మెసర్స్ నితిన్ ప్రోటీన్స్ ప్రైవేట్ లిమిటెడ్
(CIN : U15137AP2014PTC095221)
18-3-60/సి, రోడ్ నెం. 2, శ్రీహరి కాలనీ, శాంతినగర్, తిరుపతి-517501, ఆంధ్రప్రదేశ్
(పైన తెలిపిన 3 ప్లాంట్స్ బూరగమండ గ్రామం, సోడం మండలం, పిలేరు సబ్‌డిస్ట్రిక్ట్, చిత్తూరు జిల్లా వద్ద ఉన్నవి)
(లిక్విడేషన్‌లో ఉన్నవి)

గౌరవనీయ **NCLT, అమరావతి బెంచ్** వారి లిక్విడేషన్ ఉత్తర్వుల నియమాలననుసరించి, సంబంధిత కార్పొరేట్ ఋణగ్రహీతల యొక్క వ్యాపారములు అమ్మకం కొరకు లిక్విడేటర్ వారిచే బహిరంగ ప్రకటన ఇవ్వటమైనది. ఇన్సాల్వెన్సి & బ్యాంక్రప్టసి బోర్డు ఆఫ్ ఇండియా (లిక్విడేషన్ ప్రక్రియ) నిబంధనలు 2016 యొక్క 32 మరియు 33 నిబంధనలతో కూడిన 2016 ఇన్సాల్వెన్సి & బ్యాంక్రప్టసి కోడ్ నియమావళి పరిధిలో **"ఎక్కడ ఉన్నది అక్కడ" "ఏమి ఉంటే అది" "అక్కడ ఏమి ఉంటే అది"** మరియు "రీకోర్స్ లేని ప్రాతిపదికపైన అమ్మకం నిర్వహించబడుతుంది.

లిక్విడేషన్‌లో ఉన్న కంపెనీ పేరు	బిడ్‌డాక్యుమెంట్లు సమర్పణకు ఆఖరి తేది.	క్వాలిఫైడ్ బిడ్డర్ల ప్రకటనకు ఆఖరు తేది.	వేలంలో ఉన్న ఆస్తుల తనిఖీ కొరకు ఆఖరు తేది.	ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది	వేలం తేది మరియు సమయం
మెసర్స్ నితిన్ గ్రైన్స్ & మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్	18-06-2023	21-06-2023	22-06-2023 నుండి 28-06-2023	30-06-2023	02-07-2023 ఉ॥10.00 నుండి ఉ॥ 11.00 వరకు
మెసర్స్ నితిన్ న్యూట్రిషన్స్ ప్రైవేట్ లిమిటెడ్	18-06-2023	21-06-2023	22-06-2023 నుండి 28-06-2023	30-06-2023	02-07-2023 ఉ॥11.00 నుండి మ॥ 12.00 వరకు
మెసర్స్ నితిన్ ప్రోటీన్స్ ప్రైవేట్ లిమిటెడ్	18-06-2023	21-06-2023	22-06-2023 నుండి 28-06-2023	30-06-2023	02-07-2023 మ॥12.00 నుండి మ॥ 01.00 వరకు

సంబంధిత కార్పొరేట్ ఋణగ్రహీత యొక్క వ్యాపారం అమ్మకం

కార్పొరేట్ ఋణగ్రహీత పేరు	రిజర్వుధర (మొత్తం రూ॥లలో)	ధరావత్తు (మొత్తం రూ॥లలో)	కనిష్ట బిడ్ పెంపుదల విలువ (రూ॥లలో)
మెసర్స్ నితిన్ గ్రైన్స్ & మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్	2,12,57,640/-	21,25,764/-	రూ॥ 1 లక్ష
మెసర్స్ నితిన్ న్యూట్రిషన్స్ ప్రైవేట్ లిమిటెడ్	79,38,000/-	7,93,800/-	రూ॥ 1 లక్ష
మెసర్స్ నితిన్ ప్రోటీన్స్ ప్రైవేట్ లిమిటెడ్	64,29,780/-	6,42,978/-	రూ॥ 1 లక్ష

సూచనలు, నియమ నిబంధనలు :

1) అమ్మకం ఎలాంటి వారంటీలు మరియు నష్ట పరిహారములు లేకుండా నిర్వహించబడుతుంది.
2) కంపెనీ యొక్క ఆస్థులు గురించి ఆన్‌లైన్ ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లరేషన్ మరియు అండర్ టేకింగ్, ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకం యొక్క సాధారణ నియమ నిబంధనలు పూర్తి మరియు వివరణాత్మక సమాచారం "ఇ-వేలం ప్రక్రియ సమాచార డాక్యుమెంట్" నందు లభించును. "ఇ-వేలం ప్రక్రియ సమాచార డాక్యుమెంట్"తో కూడిన అమ్మకం ప్రకటన **https://www.bankeauctions.com (మెసర్స్ C1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్)** నందు లభిస్తాయి లేదా సంప్రదించండి **శ్రీ ధరణి, ఫోన్ : 9948182222, ఇ-మెయిల్ : telangana@c1india.com.**
3) "ఇ-వేలం ప్రక్రియ సమాచార డాక్యుమెంట్" నందు నిర్ణయించిన వాటితో సహా సంబంధిత నియమ నిబంధనలు తప్పనిసరిగా చదివి మరియు అంగీకరించిన తర్వాత ఆసక్తిగల బిడ్డర్స్ వేలంలో పాల్గొనవలెను.
4) ఇది విశ్వసనీయ బిడ్డర్స్‌ను ఆహ్వానించుటకు నిర్దేశించినది మరియు అమ్మకమునకు ప్రభావితం చేయుటకు లిక్విడేటర్ లేదా కార్పొరేట్ ఋణగ్రహీత తరపున ఎలాంటి బిడ్డింగ్ బాధ్యతలు సృష్టించుటకు కాదు. ఎలాంటి కారణములు చూపకుండా లిక్విడేటర్ ఏదైన లేదా అన్ని ఆఫర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుట, లేదా ఇ-వేలం వాయిదా వేయుట / రద్దు చేయుట లేదా ఏ దశలోనైన వేలం ప్రొసీడింగ్స్ నుండి ఏదైనా ఆస్థిని ఉపసంహరించుటకు హక్కు కలిగిఉన్నారు.
5) కోడ్ 35 విభాగం క్లాజు (ఎఫ్) నియమావళి ప్రకారం, కోడ్ యొక్క 29ఎ విభాగం (కాలానుగుణంగా సవరించునది) పరిధిలో నిర్దేశించిన అర్హతా యోగ్యతలు కలిగి ఉండకుండా బిడ్ దాఖలు చేయుటకు ఆసక్తిగల బిడ్డర్ అర్హులుకారు.
6) 2016 ఇన్సాల్వెన్సీ మరియు బ్యాంక్రప్టసి కోడ్ నియమావళికి మరియు అందు నిర్దేశించిన లిక్విడేషన్ ప్రక్రియ నిబంధనలకు లోబడి అమ్మకం ఉంటుంది.
7) డాక్యుమెంట్లు మరియు ధరావత్తును లిక్విడేటర్ వారికి ఇ-మెయిల్ ద్వారా మరియు హార్డ్ కాపీను వేలం డాక్యుమెంట్‌లోని నిర్ణీత నమూనాలో **18-06-2023**న లేదా ఆలోగా దాఖలు చేయవలెను.
8) ఏదైన వివరాలు కొరకు దయచేసి క్రింది సంతకందారుని సంప్రదించండి మొబైల్ : **9949926945** లేదా ఇ-మెయిల్ ఐడి : **ip.caier@gmail.com**

సం/- ఇమ్మానేని ఈశ్వరరావు, లిక్విడేటర్
IBBI Reg. No:IBBI/IPA-001/IP-P01224/2018-19/11943
ఇ-మెయిల్ ఐడి : ip.caier@gmail.com, మొబైల్ : 9949926945

తేది. : 04-06-2023
ప్రదేశం : విజయవాడ

హామీలను నెరవేర్చండి

కడప, కోనసీమ జిల్లాల్లో కొనసాగిన జాతాలు

కాకినాడలో జాతానుద్దేశించి మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి- యంత్రాంగం

మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, సిఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రారంభమైన జీపుజాతాలు శనివారం నాలుగోరోజుకు చేరుకున్నాయి. సత్యసాయి జిల్లా హిందూపురం నుంచి బయలుదేరిన జాతా కడప జిల్లాలోకి, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి బయలుదేరిన జాతా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో కొనసాగింది. జాతాకు ఆయా మున్సిపాల్టీల్లో మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు స్వాగతం పలికారు. కాకినాడలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులను కేంద్రం బానిసలుగా మార్చేసిందని విమర్శించరు. కరోనా సమయంలో 170 మంది మున్సిపల్ కార్మికులు మరణించారని తెలిపారు.

వారి కుటుంబాలకు నేటికీ ఎలాంటి సాయమూ అందలేదన్నారు. ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నంద్యాల, కడప జిల్లా ప్రొద్దుటూరులో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, రాష్ట్ర కార్యదర్శి తిరుమలరావు మాట్లాడారు. మున్సిపాలిటీలలో పనిచేసే కార్మికులకు జిఒ. నెం. 7 ప్రకారం స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలను అమలు చేసి, ప్రతి కార్మికునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు.

నంద్యాల మున్సిపాలిటీలో అక్రమంగా తొలగించిన 44 మంది కార్మికులకు హైకోర్టు తీర్పు ప్రకారం 18 నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 8న విజయవాడలో మరో పోరాటానికి పిలుపునిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాలరావు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు చంద్రబాబు తెచ్చిన 279 జిఒకు వ్యతిరేకంగా మాట్లాడిన ప్రస్తుత ముఖ్యమంత్రి ఇప్పుడు ఆ ఊసే మరిచిపోయారని విమర్శించారు. రాష్ట్రంలోని 123 మున్సిపాల్టీలలోని 45వేల మంది కార్మికులతో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమానికి ముందు నాట్యమండలి కళాకారులు గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యదర్శి నాగేంద్రబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు, ప్రజానాట్య మండలి కళాకారులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అప్పుల బాధతో ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. పట్టణంలోని శారదానగర్‌కు చెందిన సాకే గంగాధర్(37) కరోనా సమయంలో చేనేత రంగం కుదేలవ్వడంతో కుటుంబపోషణ నిమిత్తం రూ. ఎనిమిది లక్షలు అప్పులు చేశాడు. ముడిసరుకు ధరలు అమాంతం పెరగడంతో తన మగ్గాన్ని అమ్మేసి కూలిమగ్గానికి వెళ్తున్నాడు. ఇటీవల గంగాధర్ అనారోగ్యం బారినపడ్డాడు. అప్పుల బాధలు..అనారోగ్యం వేధించడంతో ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

కాలువలో పడి ఇద్దరు బాలికలు మృతి

ప్రజాశక్తి - వెంకటాచలం

నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం కనుపూరు కాలువలో శనివారం ప్రమాదవశాత్తు ఇద్దరు బాలికలు పడి మరణించారు. కసుమూరు పంచాయతీ పరిధిలోని చింతలపాలెం గ్రామ సమీపంలోని కనుపూరు కాలువలో దుస్తులు ఉతికేందుకు కడివేటి లతీషా(14) శేషం అక్షిత (11) మరో ఇద్దరు వెళ్లారు. కాలు జారి లతీషా, అక్షిత కాలువలో పడిపోయారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ఊపిరాడక ఇద్దరూ మరణించారు. స్థానికులు బాలికలను వెంకటాచలం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే బాలికలు మరణించారని వైద్యులు తెలిపారు.

'అనంతపురం' ఫ్లైఓవర్‌కు తరిమెల పేరు

- సిఎంకు సిపిఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అనంతపురం పట్టణంలోని క్లాక్ టవర్ సమీపాన నిర్మించిన ఫ్లైఓవర్‌కు తరిమెల నాగిరెడ్డి పేరు పెట్టాలని సిపిఐ రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ శనివారం లేఖ రాశారు. స్వాతంత్ర్య సంగ్రామంలో నాగిరెడ్డి ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలిపారు. అనంతపురం నుంచి ఎమ్మెల్యేగా, ఎంపిగా గెలుపొంది శాసనసభ, లోక్‌సభలలో ప్రతిపక్షనేతగా రాణించారని వివరించారు. ప్రజావాణిని చట్టసభల్లో వినిపించారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా నాగిరెడ్డి అనంతపురానికి ఎనలేని సేవలు అందించారని, ఫ్లైఓవర్‌కు ఆయన పేరు పెట్టడం అనంతపురానికే గర్వకారణమని సూచించారు.

పోలవరంపై కేంద్రం కుట్ర

- చలసాని శ్రీనివాస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి అన్యాయం చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని, సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తక్షణమే అఖిలపక్షంతో కలిసి కేంద్రంపై పోరాటం చేయాలని ఎపి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ పేర్కొన్నారు. విజయవాడలోని గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. బిజెపి ఉచ్చులో జగన్ పడకూడదని, తెలుగు ప్రజలు ఇప్పటికైనా కళ్లు తెరవాలని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై కేంద్రం తప్పుడు ప్రకటనలు చేస్తోందని, రాష్ట్రంలోని అన్ని పార్టీలూ కలిసి కేంద్రంపై పోరాటం చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నీటి నిల్వలను పరిమితం చేయడానికి కుట్ర చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అంతర్గతంగా కుమ్మక్కయ్యాయని ఆరోపణలు వస్తున్నాయని, జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు వీటిపై స్పందించాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా పోలవరం ప్రాజెక్టు నిర్మించే వరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామని చలసాని శ్రీనివాస్ పేర్కొన్నారు. మీడియా సమావేశంలో రైతాంగ సమాఖ్య అధ్యక్షులు యర్నేని నాగేంద్రనాథ్, బొప్పన రాజశేఖర్‌రావు, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి కన్వీనరు తాటికొండ నరసింహారావు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స

రోగి సైదా శ్రీనివాసరావుతో వైద్య బృందం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు ఒక రోగికి ఎలాంటి కోత, కుట్టు లేకుండా అద్భుతమైన శస్త్ర చికిత్స చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ కవిత వివరించారు. కృష్ణా జిల్లా అన్నవరం గ్రామానికి చెందిన సైదా శ్రీనివాసరావు (35) గతకొంత కాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నారు. మద్యం అలవాటు వల్ల ఈ సమస్య మరింత పెరిగింది. గత నెల 17న గుంటూరు జిజిహెచ్ క్యాజువాలిటికి వచ్చిన రోగికి జనరల్ మెడిసిన్ వైద్యులు వివిధ పరీక్షలు చేశారు. పాంక్రీజ్ వాపు వల్ల పాంక్రీజ్ గ్రంథి చుట్టూ నీటి తిత్తి, గడ్డలు ఏర్పడటం వల్ల గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి బదిలీ చేశారు.

రోగిని పరీక్ష చేసిన వైద్యులు గత నెల 24న పొట్టపై ఒక్క గాటు పడకుండా.. కోత కుట్టు లేకుండా ఎండోస్కోపి ద్వారా చికిత్స చేశారు. ఈ తరహాలో ఆపరేషన్ నిర్వహించడం రాష్ట్రంలోనే ఇది మొదటిసారి అని తెలిపారు. రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, రెండు మూడు రోజుల్లో డిశ్చార్జ్ చేస్తామని డాక్టర్ కవిత వివరించారు. ప్రయివేటు ఆస్పత్రిలో కనీసం రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు. అరుదైన శస్త్ర చికిత్స చేసిన వైద్యులను సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి అభినందించారు. ఈ చికిత్సలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ శివ రామకష్ణ, డాక్టర్ నాగూర్ బాషా, పిజి వైద్యులు అనీల్ కుమార్, మత్తు వైద్యులు డాక్టర్ నీరజ, పోలయ్య, విష్ణు మహేష్ పాల్గొన్నారు.

గర్భం దాల్చిన గిరిజన బాలిక

ప్రజాశక్తి - బాలాయపల్లి (తిరుపతి)

తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలంలో 13 ఏళ్ల బాలిక గర్భం దాల్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం మేరకు.. పిగిలాం గ్రామానికి చెందిన ముప్పాళ్ల రవీంద్ర ఓ గిరిజన బాలికకు మాయమాటలు చెప్పి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. తల్లిదండ్రులు బాలాయపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రవీంద్రను పోలీసులు అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేశారు.

చంద్రబాబు జైలుకు వెళ్లడం ఖాయం : కె.నారాయణస్వామి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో కొద్దిరోజుల్లో చంద్రబాబు జైలుకు వెళ్లడం ఖాయమని ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్అండ్‌బి అతిథిగృహంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జునతో కలిసి ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే శ్మశానంగా పోల్చడం సరికాదన్నారు. చంద్రబాబు దృష్టిలో పేదలంటే లోకేష్, సుజనాచౌదరి, నారాయణ అని ఎద్దేవా చేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

- నలుగురు మావోయిస్టులకు గాయాలు?

ప్రజాశక్తి - చింతూరు(అల్లూరి సీతారామారాజు జిల్లా)

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో శనివారం పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. కుంటబ్లాక్ పరిధిలోని ఎర్రబోరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రేగడ్లగుట్ట అటవీ ప్రాంతంలో జరిగిన ఈ ఎదురు కాల్పుల్లో నలుగురు మావోయిస్టులకు గాయాలైనట్టు సమాచారం. ఎస్‌పి కిరణ్ చౌహాన్ తెలిపిన వివరాల మేరకు.. కుంటబ్లాక్‌లో మావోయిస్టు కమాండర్ మంగాడు ఉన్నట్టు సమాచారం అందడంతో అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించామని, ఈ క్రమంలోనే ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. గాయపడిన వారిని సహచర మావోయిస్టులు అడవిలోకి ఎత్తుకుని పారిపోయినట్టు తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం

- యువగళం పాదయాత్రలో లోకేష్

బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-చాపాడు (కడప), అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయరంగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 115వ రోజుకు చేరుకుంది. శనివారం మైదుకూరు నియోజకవర్గం చాపాడు మండలంలోని విశ్వనాథపురం విడిది కేంద్రం నుంచి యాత్ర ప్రారంభమై ముద్రాయపల్లె, మైదుకూరు, శ్రీనివాసనగర్, గుంటూరు కొట్టాలు, ఖాజీపేట మండలంలోని భూమాయపల్లె విడిది కేంద్రం వరకూ సాగింది. ఆయా ప్రాంతాల్లో స్థానికులు, రైతులతో ముఖాముఖీ, మాటామంతి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా మైదుకూరులో నిర్వహించిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కాల్వలు, సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణను ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, తెలుగు గంగ కాలువ, కె.సి.కెనాల్, నిప్పులవాగు కాలువల సామర్థ్యాన్ని పెంచుతామని హామీనిచ్చారు. తాము అధికారంలోకి వస్తే కెసి కెనాల్ ఆధునీకరణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా నియోజకర్గాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకేష్‌కు ప్రాణహాని భద్రత పెంచాలని డిజిపికి టిడిపి లేఖ

యువగళం పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్‌కు రాజకీయ ప్రత్యర్థులు, అసాంఘిక శక్తులతో ప్రాణహాని ఉందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య తెలిపారు. కట్టుదిట్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలని డిజిపికి శనివారం లేఖ రాశారు. లోకేష్ పాదయాత్రపై ఓ గ్రూపు పోలీసులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శిం చారు. ప్రొద్దుటూరులో వైసిపి ఎమ్మెల్యే ప్రోద్బలంతో టిడిపి అధినేత చంద్రబాబుపై అసభ్యకర పదజాలంతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని పేర్కొ న్నారు. దీనిపై లోకేష్ స్థానిక పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోకుండా ఫ్లెక్సీల ఏర్పాటును సమర్థించారని తెలిపారు. జూన్ 1న పాదయాత్ర చేస్తున్న లోకేష్‌పై వైసిపి మద్దతు దారులు కోడిగుడ్లు, పాల ప్యాకెట్లు విసిరారని, ఈ దాడి పోలీసులకు ముందే తెలిసినా రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. నిందితులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, రక్షణ కల్పించడంలో బాధ్యతలను విస్మరించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు.

నిధులు కావాలి

- పనులపై 3,600 కోట్లు బకాయిలు
- ఎక్కువ ఉపాధి హామీ, టిడ్కోలకే
- సిఎస్ దృష్టికి బకాయిల సమస్య
- బిల్లులు అప్‌లోడ్ చేయాలన్న సిఎస్
- కార్యదర్శుల భేటీలో చర్చ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలకు నిధులు ఇవ్వాలంటూ పలు శాఖలు డిమాండ్ చేస్తున్నాయి. అనేక పథకాలకు దాదాపు రూ.3,600 కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉన్నట్లు వారు తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. ఆ బిల్లులను సిఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేయాలని సిఎస్ సూచించినట్లు సమాచారం. కొద్ది రోజుల క్రితం కూడా సిఎస్ దగ్గర జరిగిన ఒక సమావేశంలో ఈ బిల్లులపై చర్చ జరిగింది. ఏయే విభాగాల్లో ఎంత చెల్లించాలన్నది ఆయా శాఖల కార్యదర్శులు వివరించారు. చెల్లించాల్సిన మొత్తం బిల్లులు రూ.3,600 కోట్ల వరకూ ఉన్నాయి.

ఉపాధి హామీ పథకానికి రూ.903 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రాధాన్యత కలిగిన భవనాల నిర్మాణానికి సంబంధించి ఈ బకాయిలు ఉన్నట్లు ఆ శాఖ కార్యదర్శి తెలిపారు. అలాగే వాటర్‌షెడ్ల నిర్మాణానికి సంబంధించి రూ.58 కోట్లు కేంద్రానికి చెల్లించాల్సి ఉందని, ఆ నిధులు కూడా విడుదల చేయాలని కోరారు. ఇవికాక మరో రూ.78 కోట్ల బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయి అభివృద్ధి కోసం చేపట్టిన పనులకు రూ.132 కోట్లు కావాలని, ఇవి ఇస్తే మొత్తం పనులు పూర్తయిపోతాయని సంబంధిత శాఖల అధికారులు కోరారు. ఇక కీలకమైన టిడ్కో ఇళ్ల నిర్మాణానికి రూ.1,100 కోట్లు నిధుల బకాయిలు ఉన్నాయి. కేంద్ర నిధులకు సంబంధించి మరో రూ.643 కోట్లు కూడా విడుదల చేయాల్సి ఉన్నట్లు వివరించారు. అమృత్ పథకం కింద పనుల కోసం రూ.213 కోట్లు ఆర్థికశాఖ నుంచి రావాల్సి ఉందని పేర్కొన్నారు. వేసవిలో తాగునీటి సరఫరా నిమిత్తం రూ.246 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు.

పలు పథకాలకు ఇవ్వాల్సిన నిధులు (రూ. కోట్లలో)	
ఉపాధిహామీ	903
వాటర్‌షెడ్స్	146
ఎఫ్‌డిఆర్ పనులు	373
సిఎండిఎఫ్	132
టిడ్కో	1100
కేంద్ర నిధులపై	643
అమృత్ పథకం	213
తాగునీటి సరఫరా	246

నష్టాల నుంచి కోలుకున్న షేర్ మార్కెట్



న్యూఢిల్లీ : టెలికాం, లోహ, వాహన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో రెండు రోజుల వరుస నష్టాల నుంచి సూచీలు కోలుకున్నాయి. మేలో వాహన విక్రయాలు, జిఎస్‌టి వసూళ్లు మెరుగ్గా నమోదుకావడం సెంటిమెంట్‌ను బలపరిచింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 9 పైసలు పెరిగి 82.31 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.74 శాతం లాభపడి 75.57 వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా సూచీలు మెరుగ్గా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 62,601.97 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ప్రారంభ ట్రేడింగ్‌లో 62,719.84 వద్ద గరిష్టాన్ని తాకిన సూచీ.. అనంతరం ఒకదశలో 62,379.86 పాయింట్ల వద్ద కనిష్టానికి పడిపోయింది. మళ్లీ కోలుకుని 118.57 పాయింట్ల లాభంతో 62,547.11 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 46.35 పాయింట్లు పెరిగి 18,534.10 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 18,478.40- 18,573.70 పాయింట్ల మధ్య కదలాడింది. వారం ప్రాతిపదికన చూస్తే.. సెన్సెక్స్ 45.42 పాయింట్లు, నిఫ్టీ 34.75 పాయింట్లు చొప్పున లాభపడ్డాయి.

మేలో వాహన విక్రయాలు 7 శాతం పెరగడంతో హీరో మోటోకార్ప్ షేరు 3.25 శాతం లాభంతో రూ.2,891.95 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,819.11 కోట్లు పెరిగి రూ.57,793.21 కోట్లకు చేరింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 20 మెరిశాయి. టాటా స్టీల్ 1.93%, మారుతీ 1.73%, ఎం అండ్ ఎం 1.71%, సన్‌ఫార్మా 1.20%, ఎల్ అండ్ టీ 1.19%, టైటన్ 1.16%, భారతీ ఎయిర్‌టెల్ 0.98%, ఎస్‌బిఐ 0.79% చొప్పున లాభపడ్డాయి. ఇన్ఫోసిస్, విప్రో, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్ 1.58% వరకు నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో లోహ 1.71%, స్థిరాస్తి 1.33%, టెలికాం 1.06%, వాహన 0.98%, పరిశ్రమలు 0.85%, వినియోగ 0.83%, కమొడిటీస్ 0.73%, ఆరోగ్య సంరక్షణ 0.72% పెరిగాయి. ఐటీ, టెక్, యుటిలిటీస్, ఇంధన, చమురు-గ్యాస్ నీరసపడ్డాయి. బీఎస్‌ఈలో 2181 షేర్లు లాభపడగా, 1364 స్క్రిప్‌లు నష్టపోయాయి.

నారాయణపురం భూముల్లోకి రియల్ మాఫియా

- పాకల తొలగింపును అడ్డుకున్న రైతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం నారాయణపురం భూముల్లోకి మరోసారి రియల్ మాఫియా చొరబడేందుకు ప్రయత్నించింది. భూముల్లో రైతులు వేసుకున్న పశువుల పాకలను తొలగించేందుకు శనివారం జెసిబితో అదే గ్రామానికి చెందిన గాడు రామారావు, పిలక జయకృష్ణ అక్కడకు చేరుకున్నారు. పోలీసుల సమక్షంలోనే పాకలు తొలగించేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న నారాయణపురం భూ సాగు హక్కుదారుల సంఘం నాయకులు టి.నందోడు, కె.అప్పన్న, పుట్టా మల్లేషు, జె.సీతారాం, రైతులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో చేరుకుని పాకలను తొలగించడాన్ని అడ్డుకున్నారు. దీంతో వారు జెసిబిని వదిలి పారిపోయారు. ఎచ్చెర్ల ఎస్ఐ వి.సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని భూములపై కోర్టు కేసు నడుస్తోందని, పాకలను తొలగించాలని రైతులను హెచ్చరించారు. తరతరాలుగా భూముల్లో తాము సాగు చేసుకుంటున్నామని, కేసులేమీ లేవని రైతులు బదులిచ్చారు. రైతుల సమాధానంపై ఎస్ఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం రియల్ ఎస్టేట్ మాఫియాపై రైతులు, రైతులపై రియల్ ఎస్టేట్ మాఫియా ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నాయి.

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు. ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

తేది: 31.05.2022,
ఇ-టెండర్ నోటీసు నం.:407/ డిఆనఖుయఖ/డబ్ల్యూ/జిఎన్‌టి
PUB/0583

దిగువసంతకందారుడు తరపున 26.06.2023, 15.30 వరకు క్రింది విధమైన పనుల కొరకు ఇ-టెండర్‌లు ఆహ్వానించడమైనది.

క్ర.సం.: 01. టెండర్ ఐడి : 2570, సీనియర్. డిఇఎన్/డిఇఎన్ : కో. పని వివరణ : జోన్ గుంటూరు : 01.07.2023 నుండి 30.06.2024 కాలం కొరకు గుంటూరు స్టేషన్ భవనాలు మరియు వాటి ప్రాంగణాలు. సుమారు విలువ రూ.లో : 1,28,02,391/-, బిడ్ సెక్యూరిటీ రూ.లో: 2,14,000/-

క్ర.సం.2 : టెండర్ ఐడి: 2571, సీనియర్ డిఇఎన్/ డిఇఎన్ : కో. పని వివరణ: జోన్ రెడ్డిపాలెం : 01.07.2023 నుండి 30.06.2024 కాలం కొరకు కొత్త గుంటూరు (కొత్త గుంటూరు స్టేషన్ మరియు కాలనీ సహా) కు గుంటూరు (గుంటూరు స్టేషన్ మినహాయించి కానీ కాలనీలు సహా) సుమారు విలువ రూ.లో: 1,54,77,908/-, బిడ్ సెక్యూరిటీ రూ.లో: 2,27,400/-

క్ర.సం.: 3, టెండర్ ఐడి: 2572, సీనియర్.డిఇఎన్/ డిఇఎన్: కో. పని వివరణ: జోన్ నల్లపాడు: 01.07.2023 నుండి 30.06.2024 కాలం కొరకు పట్టాభిపురం వద్ద నల్లపాడు కాలనీ మరియు స్టేషన్, రైల్ విహార్ కాలనీ మరియు డివిజనల్ ఆఫీస్ క్యాంపస్. సుమారు విలువ రూ.లో: 1,87,95,986/-, బిడ్ సెక్యూరిటీ రూ.లో: 2,44,000/-.

క్ర.సం.: 4, టెండర్ ఐడి: 2573 సీనియర్.డిఇఎన్/ డిఇఎన్ : ఎన్. పని వివరణ: జోన్ రేపల్లె : 01.07.2023 నుండి 30.06.2024 కాలం కొరకు గుంటూరు (మినహా) నుండి తెనాలి (మినహా) నుండి రేపల్లె (సహా). సుమారు విలువ రూ.లో: 93,73,475/-, బిడ్ సెక్యూరిటీ రూ.లో: 1,87,500/-.

క్ర.సం.: 5, టెండర్ ఐడి: 2574, సీనియర్.డిఇఎన్/ డిఇఎన్ : ఎన్. పని వివరణ: జోన్ నడికుడి : 01.07.2023 నుండి 30.06.2024 కాలం కొరకు తుమ్మలచెరువు (మినహా), తిప్పర్తి (మినహా) నుండి నడికుడి (సహా) మరియు విష్ణుపురం (సహా) నుండి జన్పాహడ్ (సహా). సుమారు విలువ రూ.లో : 1,60,13,747/-, బిడ్ సెక్యూరిటీ రూ.లో : 2,30,100/-.

క్ర.సం.: 6, టెండర్ ఐడి : 2575, సీనియర్.డిఇఎన్/ డిఇఎన్ : ఎన్. పని వివరణ: జోన్ నల్గొండ: 01.07.2023 నుండి 30.06.2024 కాలం కొరకు మిర్యాలగూడ (మినహా) నుండి పగిడిపల్లి (మినహా). సుమారు విలువ రూ.లో : 1,37,94,348/-, బిడ్ సెక్యూరిటీ రూ.లో : 2,19,000/-.

క్ర.సం. : 7, టెండర్ ఐడి: 2576, సీనియర్.డిఇఎన్/ డిఇఎన్ : ఎన్. పని వివరణ : జోన్ న్యూ గుంటూరు: 01.07.2023 నుండి 30.06.2024 కాలం కొరకు సిరిపురం (సహా) నుండి తుమ్మలచెరువు (సహా) మరియు న్యూ పిడుగురాళ్ల (సహా) నుండి శావల్యాపురం (మినహా), సుమారు విలువ రూ.లో : 1,39,21,229/-, బిడ్ సెక్యూరిటీ రూ.లో : 2,19,600/-.

క్ర.సం.: 8, టెండర్ ఐడి: 2577, సీనియర్.డిఇఎన్/ డిఇఎన్ : డబ్ల్యూ. పని వివరణ: జోన్ దొనకొండ : 01.07.2023 నుండి 30.06.2024 కాలం కొరకు దొనకొండ (సహా) నుండి నల్లపాడు (మినహా), నల్లపాడు (మినహా) నుండి సిరిపురం (మినహా) మరియు నల్లపాడు (మినహా) నుండి గుంటూరు (మినహా) రెడ్డిపాలెం (మినహా) నుండి కృష్ణా కెనాల్ జంక్షన్ (మినహా), సుమారు విలువ రూ.లో : 1,78,38,974/-, బిడ్ సెక్యూరిటీ రూ.లో : 2,39,200/-.

క్ర.సం: 9, టెండర్ ఐడి: 2578, సీనియర్.డిఇఎన్/ డిఇఎన్ : డబ్ల్యూ. పని వివరణ: జోన్ నంద్యాల : 01.07.2023 నుండి 30.06.2024 కాలం కొరకు దొనకొండ (మినహా) నుండి నంద్యాల (సహా), సుమారు విలువ రూ.లో : 1,30,51,498/-, బిడ్ సెక్యూరిటీ రూ.లో : 2,15,300/-.

1.ఇ-బిడ్స్ ఆన్‌లైన్ సమర్పణ కొరకు చివరి తేది 26.06.2023, 15.30గం. వరకు. వివరణాత్మక సమాచారం కొరకు వెబ్‌సైట్ www.ireps.gov.in లాగిన్ అవ్వండి.
2. ఏదైనా తదుపరి కమ్యూనికేషన్/సవరణ ఉంటే ఇ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా తెలియజేయబడుతుంది.

డివిజనల్ రైల్వే మేనేజర్, (వర్క్స్), గుంటూరు.

సవరణ
టెండర్ నోటీసు నం.:జి/ఇ.29/టిఆర్./ టెండర్ నోటీసు/05/2023-24.
PUB/0584

గుంతకల్లు డివిజన్ కొరకు ఇ-టెండర్ యొక్క సమర్పణ ముగింపు తేది: సిఆర్ఎస్/టిపిటివై వర్క్‌షాప్ (టెండర్ నం.: జిటిఎల్-టిఆర్‌డి-29-ఇటిఎన్-10-2023-24) వద్ద ఎమ్ఇఎమ్‌యు మోటార్ కార్ పిఓహెచ్ కొరకు 25 కెవి ఓహెచ్ఇ కేటాయింపు 22.06.2023, 11.00గం. కు సవరించబడినది.

టెండర్ బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు http:// www.ireps.gov.in లాగిన్ అవ్వండి.

సీనియర్.డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ట్రాక్షన్, గుంతకల్లు.

తేది: 02.06.2023,
టెండర్ నోటీసు నం.: 06/డబ్ల్యూడబ్ల్యూఎస్/ ఆర్‌వైపిఎస్/2023,
PUB/0585

భారత రాష్ట్రపతి మరియు డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్/ఆర్‌వైపిఎస్, సౌత్ సెంట్రల్ రైల్వే, వాగన్ వర్క్‌షాప్, గుంటుపల్లి-521 241 తరఫున ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది.

టెండర్ నం.: జిఆర్/ఎమ్/198/బిఓఎక్స్ఎన్ఆర్-ఆర్‌హెచ్/06/2023.

వివరణ: "గుంటుపల్లిలోని వ్యాగన్ వర్క్‌షాప్ యొక్క ప్రాంగణంలో ఆర్‌డిఎస్ఓ ఎస్‌టిఆర్ నం.డబ్ల్యుడి-16-బిఓఎక్స్ఎన్ఆర్-2010 (రెవ్-2) ప్రకారం బిఓఎక్స్ఎన్ నుండి బిఓఎక్స్ఎన్ఆర్ వ్యాగన్ల అప్-గ్రేడేషన్ మరియు పునరావాసం"

పరిమాణం: 200 వ్యాగన్లు.

పూర్తి కాలం: 18 నెలలు.

టెండర్ విలువ: రూ.21,68,60,690.63/- (ఇరవై ఒక కోట్ల అరవై ఎనిమిది లక్షల అరవై వేల ఆరు వందల తొంభై రూపాయల అరవై మూడు పైసలు మాత్రమే)

ధరావత్తు డిపాజిట్ మొత్తం: రూ.12,34,300/- (పన్నెండు లక్షల ముప్పై నాలుగు వేల మూడు వందల రూపాయలు మాత్రమే)

టెండర్ డాక్యుమెంట్ ఖరీదు: ఉచితంగా.

ఆఫర్ చెల్లుబాటు: ప్రారంభం తేది నుండి 60 రోజులు.

టెండర్ రకం: ఐఆర్‌జిసిసి-2022 ద్వారా నిర్వహించబడే పనుల టెండర్.

టెండరింగ్ వ్యవస్థ : టూ ప్యాకెట్ సిస్టం.

పని యొక్క పోలిన స్వభావం : వర్తించే.

బిడ్ ముగింపు తేది మరియు సమయం: తేది: 06.07.2023, 15.00గం.

బిడ్ ప్రారంభ తేది మరియు సమయం: 06.07.2023, 15.15 గం.

ప్రీ-బిడ్ మీటింగ్: 12.06.2023, 12.00గం. వద్ద

టెండర్ డాక్యుమెంట్ మరియు మార్పులు/సవరణ ఏదైనా: వెబ్‌సైట్ "http://www.ireps.gov.in" ను సందర్శించండి.

A0827
డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్, వ్యాగన్ వర్క్‌షాప్, గుంటుపల్లి.

తదుపరి టెండర్ నియమాలు/వివరాలు మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కోసం దయచేసి వెబ్‌సైట్ https:www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.inని సందర్శించండి.

MUNICIPAL CORPORATION KADAPA

"ap'e-procurement Short Tender Notice. "ap' e-procurement Tender Notice. /GGMP/15THFCG/GF/ATO/MCK dt: 02.06.2023

S.No.	Name of the Work	No.of Works	Ecv.Rs.in Lakhs
01	General Fund	60	288.84
03	GGMP	08	93.57
04	Mplads	03	8.41
05	15th FCG	08	115.31
	TOTAL:-	79	506.12

06. Bid Document Download Start Date : 03.06.2023 @ 03.00 P.M.
07. Bid Document Download End Date : 12.06.2023 @ 03.00 P.M.
08. Bid Submission Closing Date & Time : 12.06.2023 @ 03.30 P.M.
09. Technical Bid Opening Date : 12.06.2023 @ 04.00 P.M.

Further details can be seen at 'e'Procurement market place in www.apeprocurement.gov.in officer inviting bid, Commissioner, Municipal Corporation of Kadapa, A.P.

Commissioner
Municipal Corporation, Kadapa.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2023
ఎంట్రీలకు ఆహ్వానం

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు కావస్తున్నది. కోవిడ్ మహమ్మారి కారణంగా 2020, 2021 సంవత్సరాల్లో మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2023 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ సంపాదకులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావులతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం **ఏదేని ప్రజా సమస్యపై రాసిన క్షేత్ర స్థాయి వార్తా కథనాలను, ఫీచర్స్‌ను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2022 మే 1నుంచి 2023 ఏప్రిల్ 30లోపు తెలుగు దిన పత్రికల్లో, స్పెషల్స్‌లో ప్రచురితమైన వార్తా కథనాలు, ఫీచర్స్ మాత్రమే పంపాలి.** ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం ఒకటి జతచేసి పంపాలి. తమకు నచ్చిన మంచి సమస్యాత్మక కథనాన్ని ఇతరులైనా పంపవచ్చు. అచ్చయిన తేదీ, ఎడిషన్ వివరాలు జత చేయాలి. ఒక్కొక్కరు ఒకటి లేదా రెండు వార్తాకథనాలను మాత్రమే పంపాలి. ఎంట్రీలు 2023 జూన్ 10 కల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2023 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2023 జూన్ మూడవ వారంలో పుట్టపర్తిలో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎం వి ఎస్ శర్మ, కార్యదర్శి,
ప్రజాశక్తి సాహితీ సంస్థ

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా : కార్యదర్శి, ప్రజాశక్తి సాహితీ సంస్థ, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి, గుంటూరు జిల్లా, పిన్: 522501. ఇ-మెయిల్ అడ్రస్: psmhaward@gmail.com

సంపాదకీయం

పర్యా' హననం .. పర్యవసానం

మనం బతకటానికి ఏవేవీ ముఖ్యమైన అవసరమో – అవన్నీ ప్రకృతిలో ఉచితంగా, ధారాళంగా లభిస్తాయి. యథేచ్ఛగా వాడేస్తూ, వాటి ప్రాధాన్యాన్ని మనం అంతగా గుర్తించం. ఏవేవీ మనకు అంతగా అవసరం కాదో వాటి గురించి ఎక్కువ తాపత్రయపడతాం, ఈ అవగాహనలో ఉన్న లోపం కారణంగానే ప్రకృతిని మనం సరిగ్గా పట్టించుకోవటం లేదు. ఆధునిక జీవితం మొదలైన దగ్గర నుంచి ఈ అగాధం మరింత పెరిగింది. అర్థం చేసుకోవటానికి ఆలస్యమైనకొద్దీ అది ప్రమాదకరంగా పరిణమిస్తోంది. కాలగతులు మారిపోతున్నాయి. తీవ్రమైన ఎండలు.. భయంకరమైన చలిగాలులు వెంటాడుతున్నాయి. మంచుతుపాన్లు ముంచుకొస్తున్నాయి. ధ్రువప్రాంతాలు కరిగిపోతున్నాయి. సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. ఊహించని ఉత్పాతాలు ఆకస్మికంగా తలెత్తుతున్నాయి. గుర్తించేలోపునే విలయ విధ్వంసం సృష్టించి పోతున్నాయి.

ప్రకృతిలో మనిషికి ఉన్న బలం, తెలివీ మరే జీవికీ లేవు. యుక్తితో కూడిన శక్తి ముందు ఎంతటి మహా శక్తి అయినా తల వొంచాల్సిందే! ఐదారడుగుల మనిషి ముందు అలాగే వొంచింది ప్రకృతిలోని సమస్తం. ఎలా ఆడిస్తే అలా ఆడాయి జంతువులు. అధిరోహిస్తే అణిగి ఉన్నాయి పర్వతాలు. తవ్వేకొద్దీ దారిచ్చాయి గనులూ, వనులూ. వెతికేకొద్దీ బతకనిచ్చాయి సముద్ర జలాలు. అన్వేషించే కొద్దీ అర్థమయ్యాయి ఆకాశ రహస్యాలు. పట్టణాలు, నగరాలు, మహా నగరాలు నిర్మితమయ్యాయి. నదుల మీద ఆనకట్టలు, పర్వతాల మధ్య ఇనప వంతెనలు, కొండల మధ్య కొంగొత్త నగరాలు, గమ్యాల మధ్య అతివేగ వాహనాలూ, క్షణక్షణ కాలంలోనే సమాచార విస్ఫోటాలు... విలసిల్లాయి, విస్తరించాయి. ఆధునిక జీవితం, అత్యద్భుత శాస్త్ర సాంకేతిక సామర్థ్యం ... అని అనుకుంటుండగానే– వెనక నుంచి ప్రమాద ఘంటికలు వినిపిస్తున్నాయి.

ఎండలు తీవ్రం...వానల పెడముఖం.. అకాల వరదల ఉధృతం.. సునామీల బీభత్సం... పెనుగాలుల భయానకం.. తాగునీరు కాలుష్యం.. సాగునీరూ విషతుల్యం.. రుతువులు గతి తప్పి.. రుతు ధర్మాలు వికటించి .. ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని దారుణ స్థితి! ఇలాంటి ప్రకృతి ప్రకోపాలు అనేకం చవిచూశాక– ఓసారి వెనక్కి తిరిగి చూస్తే– ఇదంతా మానవ స్వార్థం విచక్షణా రహితంగా ప్రకృతిపై సాగిస్తున్న అత్యాచారపు పర్యవసానం అని అర్థమవుతోంది. కార్పొరేట్ శక్తుల విపరీత లాభాల విజృంభణ ఫలితమని తెలుస్తోంది.

మన వెనకటి తరాల జనం ప్రకృతిని ఆరాధించారు. దానిని ఆధారంగా చేసుకున్నారు తప్ప అధ్వానంగా, అత్యాశాపూరితంగా వ్యవహరించలేదు. ఇప్పటికీ కొండల్లో నివసించే వారు అంతే జాగ్రత్తగా ఉంటారు. వంట చెరకుగా ఎండిన చెట్లనే నరుకుతారు. పచ్చని చెట్లను నరకటం తప్పుగా భావిస్తారు. లాభాలను సంపాదించే స్వార్థపరుల కన్ను అడవిపై పడినప్పటినుంచే – అటవీ విధ్వంసం ప్రారంభమైంది. ఏ దేశంలోనైనా ప్రకృతి సమతుల్యంగా ఉండాలంటే– అటవీప్రాంతం 33 శాతం ఉండాలి. మనదేశంలో ఇప్పుడు 21.54 శాతమే ఉంది. అత్యల్పంగా ఉన్నది గుజరాత్‌లో 7.5 శాతమైతే, హర్యానాలో 4 శాతమే! మన రాష్ట్రంలో అడవులు జాతీయ సగటు కన్నా తక్కువ (17.27 శాతం). ఈ లెక్కలను బట్టే మన బాధ్యత కూడా ఉంటుంది.

దాదాపు 400 ఏళ్ల క్రితం అమెరికా, యూరప్ దేశాల్లో పారిశ్రామిక విప్లవం ప్రారంభమైంది. ఈ భూమిని కాలుష్యమయం చేయటంలో, కర్బన ఉద్గారాలతో పర్యావరణానికి హాని చేయడంలో వారి పాత్ర అప్పటినుంచీ ఉంది. భూమ్మీద ఉష్ణోగ్రతలు ఇంతగా పెరగటంలో సంపన్న దేశాలదే పెద్ద పాత్ర. తరువాతి కాలంలో ఆ దేశాలు కాలుష్యాన్ని వెదజల్లే యంత్రాలను, వాటి పరిజ్ఞానాన్ని మన లాంటి తృతీయ ప్రపంచ దేశాలకు ఎగుమతి చేశాయి. తాము ఇప్పుడు తక్కువ కాలుష్యం సృష్టించే యంత్ర పరిజ్ఞానం వినియోగిస్తున్నాయి. అయినంత మాత్రాన ఇప్పటిదాకా సాగిన విధ్వంసానికి బాధ్యత వహించనంటే కుదురుతుందా? తొలినుంచీ ఎవరు ఎంత కారణమైతే అంత బాధ్యత వహించటం న్యాయం. అందుచేత పర్యావరణ పరిరక్షణకు ఎక్కువ నిధులు ఇవ్వాల్సిన బాధ్యత సంపన్న దేశాలదే!

దేశాలకు, ప్రాంతాలకు సరిహద్దులు ఉంటాయి. గాలికి, నీటికి, ప్రకృతికి ఏ హద్దులూ ఉండవు. ఎవరి ఊపిరికైనా ఒకటే గాలి. ఎవరి దాహానికైనా ఒకటే నీరు. ఇటువంటి అమూల్యమైన ప్రాణావసరాలను కాపాడుకోవటం మనందరి బాధ్యత. 'బతుకు – బతకనివ్వు' అంటుంది ప్రకృతి. దానిని పాటిస్తే– అందరూ బాగుంటారు. ఆ అందరిలో మనమూ ఉంటాం.

మంచి మాట

కసిని పెంచే మతము
కసులు కప్పే గతము
కాదు మన అభిమతము
ఓ కూనలమ్మ!

- ఆరుద్ర

ప్రముఖ కవి, కథకుడు, సాహితీవేత్త, పరిశోధకుడు.

జననం : 31.8.1925 - మరణం : 4.6.1998

ప్రస్తుతం

రెండు రాష్ట్రాలు- రెండు దృశ్యాలు

తెలకపల్లి రవి

జూన్ రెండవ తేదీతో తెలుగు రాష్ట్రాల విభజన పదో ఏట ప్రవేశించింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం బిఆర్‌ఎస్ పార్టీ దశమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభించాయి. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం నవంబర్ ఒకటవ తేదీనే అవతరణ దినోత్సవంగా జరుపుతున్నారు. ఈ తొమ్మిదేళ్ల పరిస్థితులపై మీడియా చర్చలు నిర్వహించింది. తెలంగాణ నుంచి అప్పటి ఉద్యమకారులు, వివిధ పార్టీల నాయకులు చర్చల్లో పాల్గొంటే ఏ.పి నుంచి మాత్రం ప్రధానంగా నాడు ఈ తతంగానికి చివరిదాకా భాగం పంచుకున్న అప్పటి కాంగ్రెస్ మాజీ ఎంపీలే ప్రతినిధులయ్యారు. పత్రికలలోనూ వివిధ వాదనలతో వ్యాసాలు వచ్చాయి. తెలంగాణలో ఏడాది పొడుగునా ఉత్సవాలు జరపడమే గాక ఏడాది చివరలో ఎన్నికలు వస్తాయి గనక ఎక్కువ వాదోపవాదాలు జరుగుతాయి. అదే ఏ.పి విషయానికి వస్తే వేడుకగా జరుపుకోవడం కంటే విభజన సమస్యలపై దృష్టి ఎక్కువగా వుంటుంది. రాష్ట్రానికి సంబంధించిన రెవెన్యూ లోటు భర్తీ, తెలంగాణ నుంచి బకాయిలు, నదీజలాల పంపిణీ వంటి వాటిపై బోలెడు ఫిర్యాదులున్నాయి. వీటికి తెలంగాణ వాదనలు మరో విధంగా వున్నాయి. రావలసిన బకాయిలపైనా ఉభయ రాష్ట్రాలు భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వాల విషయానికి వస్తే కూడా తెలంగాణలో వరుసగా టిఆర్‌ఎస్/బిఆర్‌ఎస్ ప్రభుత్వం కెసిఆర్ నాయకత్వంలో కొనసాగుతుంటే ఏ.పి లో మొదటి పర్యాయం చంద్రబాబు నాయుడు టిడిపి సర్కారు తర్వాత వచ్చిన జగన్ మోహన్ రెడ్డి వైసిపి సర్కారు పాలన సాగుతున్నది. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు మరో ఏడాదిలో ఉమ్మడి రాజధాని హోదా ముగిసిపోనుండగా ఏ.పి రాజధాని సమస్య ఎడతెగని ప్రతిష్టంభనగా మారింది. ఇలా రెండు రాష్ట్రాలు రెండు భిన్న దృశ్యాలను తలపిస్తున్నాయి.

తెలంగాణలో పరిస్థితి

తెలంగాణ ఏర్పడిన తొలి దశలో కెసిఆర్ అవతలి పార్టీల నుంచి భారీగా ఎమ్మెల్యేలను చేర్చుకున్నారు. బంగారు తెలంగాణ నిర్మాణానికి వారంతా కలసి వచ్చినట్టు చెప్పారు. స్వల్ప మెజార్టీతోనే అధికారానికి వచ్చిన టిఆర్‌ఎస్ అధినేత తన ప్రభుత్వాన్ని కూలదోసే కుట్ర జరుగుతున్నట్టు సమాచారం రావడం వల్లనే ఈ చర్య తీసుకున్నట్టు చెప్పారు. నెమ్మదిగా తెలంగాణలో కాంగ్రెస్, టిడిపిల నుంచి చాలామంది నాయకులు టిఆర్‌ఎస్‌లో చేరారు. రెండోసారి శాసనసభ ఎన్నికల తర్వాత ఆ లెజిస్లేచర్ పార్టీలే అదృశ్యమయ్యాయనే వాతావరణం కల్పించబడింది. మరోవైపున పాలనాపరంగా కెసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుపై అత్యధిక ప్రాధాన్యత పెట్టారు. దానికి సంబంధించి అనేక ఆరోపణలు, భారీ అప్పులు కూడా పెరిగాయి గాని దాని ప్రయోజనం తిరుగులేనిదన్న వాదన పైనే ప్రభుత్వం ప్రజల్లోకి వెళ్లింది. చెరువుల పునరుద్ధరణ, యాదాద్రి పునర్నిర్మాణం, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, విద్యుదుత్పత్తి, గురుకులాలు, కొత్త జిల్లాలు, రైతుబంధు, దళితబంధు, వైద్యం ఇలా వివిధ పథకాలపై కేంద్రీకరించారు. హైదరాబాద్ అప్పటికే ఐ.టి హబ్‌గా వుంది గనక దాన్ని మరింత వేగవంతం చేశారు. ధనిక రాష్ట్రం అన్న మాట చెబుతూనే వీటి కోసం అప్పులు కూడా భారీగానే చేశారు. మొత్తంపైన కెసిఆర్ పాలనపై తొలి దశలో మొత్తం ఫీల్‌గుడ్ ఫ్యాక్టర్ కొనసాగింది. మీడియా యుద్ధాలూ సాగాయి. ఉద్యోగుల విషయంలోనూ పలు సమస్యలున్నా సానుకూల నిర్ణయాలు తీసుకుని సద్భావన కోసం కృషి చేశారు. అనేక అంశాల్లో విమర్శలూ వున్నా మొత్తంపైన మిశ్రమ ప్రభావమే కనిపించింది. కరోనా వ్యాప్తికి ముందు వరకూ కెసిఆర్ చాలావరకూ కేంద్రంతో మోడీతో సత్సంబంధాలే నెరిపారు. అయితే బండి సంజయ్ తదితరుల నాయకత్వం, మోడీ మలి దశ అధికారం వచ్చాక క్రమేణా కేంద్ర విధానాలపై విమర్శలు పెంచారు. రాష్ట్రాల హక్కులకు భంగం, మతతత్వ రాజకీయాలు గట్టిగా వ్యతిరేకించడం మొదలెట్టారు. తన పార్టీని బిఆర్‌ఎస్‌గా మార్చారు. ఈ దశలో బిజెపి తానే అధికారంలోకి వస్తానంటూ హడావుడి చేసి మత రాజకీయాలు పెంచేందుకు ప్రయత్నించింది. కాంగ్రెస్ అనైక్యత ఒకవైపు, దేశవ్యాపిత బలహీనత ఒకవైపు వెంటాడాయి. మొత్తంపైన కెసిఆర్ కుటుంబ పాలన అన్నదే ఈ రెండు పార్టీలకూ ప్రధాన నినాదంగా తయారైంది. ప్రతిపక్షాల ఆందోళనలపైనా ప్రభుత్వం తీవ్రంగానే వ్యవహరించింది. బిఆర్‌ఎస్‌గా మారాక చుట్టుపక్కల రాష్ట్రాలలో కార్యకలాపాలు పెంచేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర సమితి భారత రాష్ట్ర సమితిగా మారడం ఒక రాజకీయ మార్పు. అయితే ప్రతిపక్ష ఐక్యత పట్ల ఇప్పటికీ బిఆర్‌ఎస్‌కు భిన్న వ్యాఖ్యలు చేస్తుంటుంది. మోడీని దించడమే కీలకం కాదని ప్రభుత్వ నిర్వహణ మారడం కీలకమని అంటుంటుంది. తమకు ఫ్రంట్‌లు, స్టంట్‌ల పట్ల ఆసక్తి లేదని తాజాగా కూడా కెటిఆర్ చెప్పారు. బిజెపిపై పోరాటానికి మద్దతు తెలిపిన వామపక్షాలు మునుగోడు ఉప ఎన్నికలలో బిఆర్‌ఎస్ గెలుపునకు కారణమైనాయి. కర్ణాటక విజయం తర్వాత కాంగ్రెస్ హడావుడి పెరగ్గా బిజెపి హంగామా తగ్గింది. అనేక చిన్న పార్టీలు కూడా కేవలం బిఆర్‌ఎస్ పైనే కేంద్రీకరించి మతతత్వ రాజకీయాలపై మాట్లాడ్డం లేదు. ఈ మధ్యలోనే నూతన సచివాలయం, అంబేద్కర్ విగ్రహం, అమరుల స్థూపం వంటి వాటితో కెసిఆర్ ప్రజలను ఆకర్షించే ప్రయత్నం తీవ్రంగానే చేస్తున్నారు. ఈ విధంగా తెలంగాణ రాజకీయం మూడో ఎన్నికలతో కొత్త మలుపు తిరిగే పరిస్థితి నెలకొంది.

> **అప్పులు విపరీతంగా పెరిగాయి. పైగా కేంద్రం విభజన చట్టంలోని హామీలు అమలు చేయకపోవడం వల్ల రాష్ట్రం మరింత నష్టపోయింది. ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి, రెవెన్యూ లోటు ప్రతిదీ అసంపూర్ణంగానే మిగిలింది. హైదరాబాదులో ఉమ్మడి సంస్థల నిధుల విభజన కూడా చాలా భాగం మిగిలే వుంది. చంద్రబాబు హయాంలో ప్రభుత్వంలో కూడా వున్న బిజెపి ఇందులో ఒక్కటైనా పూర్తి చేసేందుకు ప్రయత్నించింది లేదు.**

ఏ.పి లో ఏమవుతోంది?

ఏ.పి విషయానికి వస్తే ఈ కాలంలో రెండు ప్రభుత్వాలు మారాయి. చంద్రబాబు ఘోర పరాజయం, జగన్ వైసిపి అసాధారణ మెజార్టీ అక్కడ పరిస్థితిని మార్చేశాయి. చంద్రబాబు గొప్పగా చెప్పుకున్న రాజధాని అమరావతి తొలి దశలో వుండగానే దిగిపోయారు. జగన్ మూడు రాజధానుల విధానం ప్రకటించి లీగల్ రాజకీయ వివాదం చేస్తున్నారు. టిడిపి హైటెక్ విజన్ ప్రచారంతో కాలం గడిపితే జగన్ అచ్చంగా బటన్ నొక్కి సంక్షేమ పథకాల నిధులు బదలాయించే విధానం పెట్టుకున్నారు. కియా వంటి ఒకటి రెండు కంపెనీలు తప్పితే పెట్టుబడులు రావడం, ఉపాధి కల్పన చాలా సమస్యగా మారాయి. సచివాలయ వాలంటీర్ల ఉద్యోగాలే జగన్ ప్రభుత్వం ప్రధానాంశంగా చెప్పుకుంటుంది. అప్పులు విపరీతంగా పెరిగాయి. పైగా కేంద్రం విభజన చట్టంలోని హామీలు అమలు చేయకపోవడం వల్ల రాష్ట్రం మరింత నష్టపోయింది. ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి, రెవెన్యూ లోటు ప్రతిదీ అసంపూర్ణంగానే మిగిలింది. హైదరాబాదులో ఉమ్మడి సంస్థల నిధుల విభజన కూడా చాలా భాగం మిగిలే వుంది. చంద్రబాబు హయాంలో ప్రభుత్వంలో కూడా వున్న బిజెపి ఇందులో ఒక్కటైనా పూర్తి చేసేందుకు ప్రయత్నించింది లేదు. జగన్, చంద్రబాబు కూడా బిజెపితో మంచిగా లోబడి వుండటానికి పాకులాడటంతో ఏ.పి పరిస్థితి అధ్వాన్నంగానే తయారైంది. తన పాలన కొనసాగివుంటే అద్భుతమైన అభివృద్ధి జరిగేదని చంద్రబాబు అంటుంటే...తన సంక్షేమ పథకాలే మహత్తరమైనవని జగన్ ప్రచారం సాగుతున్నది. ఉభయులూ కలిసి కేంద్రంపై ఒత్తిడి తేవడానికి పోరాడవలసింది పోయి దాని మెప్పు కోసం పాకులాడటంలో పోటీ పడుతున్నారు. మధ్యలో జనసేన సరేసరి. ఏతావాతా ఏ.పి అభివృద్ధి వెనకబడి పోవడం కాదనలేని సత్యం. ప్రతిపక్షాలపై నిర్బంధం, అసహన రాజకీయాలు, మీడియా వివాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఇన్నిటి మధ్యనా రాష్ట్రంలో ఒక అనిశ్చితి ఏర్పడింది. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ముఖ్యమంత్రి జగన్ శంకుస్థాపనలు, భూమి పూజలు పెంచుతున్నా అవి పూర్తి కావడానికి నిధులు కాని, వ్యవధి కాని లేవు. ఆఖరుకు చంద్రబాబు కూడా తన 2020, 2047 విజన్లు పక్కనపెట్టి జగన్ తరహా పథకాలే అమలు చేస్తానని ప్రణాళిక ప్రకటించడం మొదలెట్టారు. ఏమైనా రాజధాని, పోలవరం, రాయలసీమ వంటి సమస్యలేవీ ఎన్నికల లోపు పరిష్కారమయ్యే ఆశలు లేవు. ఒక్క ముక్కలో చెప్పాలంటే విభజితాంధ్రప్రదేశ్ పరిస్థితి అయోమయంగానే తయారైంది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ లాంటి కొత్త సవాళ్లు కూడా ముంచుకొచ్చాయి. ప్రకృతి వనరులూ ప్రజల శక్తియుక్తులకు లోటు లేని ఏ.పి సమగ్రాభివృద్ధి ప్రాంతీయ సమతుల్యత దిశలో అడుగులు వేయాలి. టిఆర్‌ఎస్ బిఆర్‌ఎస్‌గా మారి ఏ.పి లోనూ రాజకీయ ప్రవేశం చేసింది గనక రెండు రాష్ట్రాల రాజకీయాలు మాట్లాడుతున్నది.

> **స్వాభావికంగానే విభజన ప్రభావం రెండు చోట్ల రెండు రకాలుగా వుంది. ఒకరినొకరు పోటీ పెట్టి చూసుకోవడం, చులకన చేసుకోవడం అవాంఛనీయం. ప్రధాన పాలక పార్టీలు ఎక్కడి పాట అక్కడ పాడటం మానాలి. ఎక్కడైనా సరే విధానాలు మారకుండా నాయకుల గొప్పతనమే కీలకమన్న ప్రచారాలు ఆపాలి. విభజన సమస్యలు ఇచ్చిపుచ్చుకునే రీతిలో పరిష్కరించుకోవాలి. కావాలని వాటిని పేరబెట్టిన కేంద్రంపై ఉమ్మడిగా ఒత్తిడి తేవాలి.**

> **కరోనా వ్యాప్తికి ముందు వరకూ కెసిఆర్ చాలావరకూ కేంద్రంతో మోడీతో సత్సంబంధాలే నెరిపారు. అయితే బండి సంజయ్ తదితరుల నాయకత్వం, మోడీ మలి దశ అధికారం వచ్చాక క్రమేణా కేంద్ర విధానాలపై విమర్శలు పెంచారు. రాష్ట్రాల హక్కులకు భంగం, మతతత్వ రాజకీయాలు గట్టిగా వ్యతిరేకించడం మొదలెట్టారు. తన పార్టీని బిఆర్‌ఎస్‌గా మార్చారు. ఈ దశలో బిజెపి తానే అధికారంలోకి వస్తానంటూ హడావుడి చేసి మత రాజకీయాలు పెంచేందుకు ప్రయత్నించింది. కాంగ్రెస్ అనైక్యత ఒకవైపు, దేశవ్యాపిత బలహీనత ఒకవైపు వెంటాడాయి. మొత్తంపైన కెసిఆర్ కుటుంబ పాలన అన్నదే ఈ రెండు పార్టీలకూ ప్రధాన నినాదంగా తయారైంది.**

సహేతుక పరిష్కారాలు

కొంతమంది అంటున్నట్టు ఇదేదో రెండు రాష్ట్రాల మధ్య వైరుధ్యంగానో నాయకుల గొప్పతనం లేదా లోపంగానో చూడటం పాక్షికమవుతుంది. స్వాభావికంగానే విభజన ప్రభావం రెండు చోట్ల రెండు రకాలుగా వుంది. ఒకరినొకరు పోటీ పెట్టి చూసుకోవడం, చులకన చేసుకోవడం అవాంఛనీయం. ప్రధాన పాలక పార్టీలు ఎక్కడి పాట అక్కడ పాడటం మానాలి. ఎక్కడైనా సరే విధానాలు మారకుండా నాయకుల గొప్పతనమే కీలకమన్న ప్రచారాలు ఆపాలి. విభజన సమస్యలు ఇచ్చిపుచ్చుకునే రీతిలో పరిష్కరించుకోవాలి. కావాలని వాటిని పేరబెట్టిన కేంద్రంపై ఉమ్మడిగా ఒత్తిడి తేవాలి. సహేతుకమైన సత్వర పరిష్కారాలు ఉభయులకూ మేలు చేస్తాయి. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలూ లౌకిక విలువలనూ మత సామరస్యాన్ని కోరుకుంటారు. ఏ.పి లో పాలక పార్టీలన్నీ బిజెపితో చేరినా ప్రజలు మాత్రం గతంలో వలెనే ఇప్పుడూ మత రాజకీయాలను ఆదరించే ప్రసక్తి వుండదు. ఆ లౌకిక ప్రజాస్వామ్యాన్ని, సహోదర భావాన్ని కాపాడుకోవడమే తెలుగు రాష్ట్రాలకు నిజమైన రక్ష.

నివాళి

కష్టాల కడలి, ఆశయాల శిఖరం పర్వ

సిహెచ్. నర్సింగరావు

ఆంధ్ర రాష్ట్రంలో కార్మిక రంగాన్ని పునరుద్ధరించి వర్గపోరాట దిశగా నడిపించడంలో పర్వ సత్యనారాయణ, నండూరి ప్రసాదరావుల పాత్ర కీలకమైనది. నండూరి ప్రసాదరావు పేరు మీదున్న విశాఖ జిల్లా సిఐటియు కార్యాలయాన్ని 2005లో పర్వ ప్రారంభించారు. వీరిద్దరూ రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో, జిల్లాల్లో కార్మికోద్యమానికి పునాదులు వేశారు. పర్వ 1924 జూన్ 4వ తేదీన జన్మించారు. 2023 జూన్ 4 నుంచి 2024 వరకు పర్వ "శత జయంతి" నిర్వహించాలని సిఐటియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటి నిర్ణయించింది. ఈ సంవత్సర కాలమంతా పర్వ సత్యనారాయణ పేరుతో విభిన్న కార్యక్రమాలు నిర్వహించాలని సిఐటియు ఆశిస్తున్నది. విశాఖలో జూన్ 4న పర్వ శత జయంతి ప్రారంభ సభతో ఈ కార్యక్రమాలు మొదలవుతాయి.

పర్వ సత్యనారాయణ వయోభారంతో 91వ ఏట 2015 మే 22న ఏలూరులో తుది శ్వాస విడిచారు. ఆయన ఏలూరులో తన కుమార్తె లీల, అల్లుడు మంతెన సీతారాం వద్ద తుది జీవితం గడిపారు. ఆయన భార్య భారతీదేవి ఇటీవల మరణించారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరంతా ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నవారే. పర్వ జీవితం ఎక్కువ భాగం ఖమ్మం జిల్లా కొత్తగూడెంలోనే గడిచింది. 1947 చివరిలో అరెస్టయిన పర్వా 1953 జనవరి వరకు 6 సంవత్సరాలు జైల్లో ఉన్నారు. ఆ తర్వాత 1964 డిసెంబర్ 31 నుంచి 1966 మే దాకా జైల్లో ఉన్నారు. పార్టీ పనుల మీద కొత్త గూడెం వచ్చి రహస్యంగా తిరుగుతున్న సమయంలో పోలీసులు పసిగట్టి అరెస్ట్ చేసి వరంగల్ జైల్లో పెట్టారు. 1949 మార్చిలో ఔరంగాబాద్ జైలు నుంచి తప్పించుకొని తిరిగి అడవి ప్రాంతంలోకి వెళ్ళి మరలా ఉద్యమంలో పాల్గొన్నారు. తెంగాణ ఉద్యమం సందర్భంగా మరో నాలుగేళ్ళు జైల్లో ఉన్నారు. తన పందొమ్మిదవ సంవత్సరంలో పర్వ కొత్తగూడెంలో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. సింగరేణి బొగ్గు గనిలో రెండేళ్ళ పాటు పర్మినెంట్ ఉద్యోగం చేశారు. తరువాత ఉద్యోగం వదిలి ఉద్యమంలో చేరారు. 72 ఏళ్ళ ఉద్యమ కాలంలో ఏనాడూ సంపాదన కోసం వెంపర్లాడలేదు. చనిపోయేనాటికి ఆయనకు సొంత గూడు కూడా లేదు. 1962లో పాల్వంచ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై నాలుగేళ్ళు పనిచేసి "విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు" ఉద్యమంలో భాగంగా పదవులకు రాజీనామా చేశారు. జీవితమంతా ప్రజల కోసం, ప్రజా ఉద్యమం కోసం ధారపోసిన యోధుడు కామ్రేడ్ పర్వ. ఆయన జీవితం మొత్తం కష్టాలే. కాష్టాలెన్ని ఉన్నా తమ ఆశయాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చాలన్నదే ఆయన పట్టుదల. సోషలిజం ద్వారానే కార్మిక వర్గ రాజ్యం ఏర్పడుతుంది. కార్మికులకు విద్య, వైద్యం, ఉపాధి లాంటి హక్కులు సాధ్యమవుతాయని ప్రతి సభలోను ప్రబోధించేవారు.

నేడు విశాఖలో పర్వ శత జయంతి ప్రారంభ సభ

1944లో 19వ ఏట సింగరేణి నుంచి వలంటీర్‌గా ఖమ్మంలో జరిగిన ఆంధ్ర మహాసభకు పర్వ హాజరయ్యారు. ఆ మహాసభ లోనే అనేక మంది నాయకులతో ఆయనకు పరిచయం ఏర్పడింది. రావి నారయణ రెడ్డి, రామనాథం, ఎల్లారెడ్డి, రాజబహుదూర్ గౌడ్, రమణయ్యల పరిచయం...ఆ తరువాత ఉద్యమంలో ఉత్సాహంగా పని చెయ్యటానికి ఎంతగానో తోడ్పడింది. 1944లో ఆలిండియా కిసాన్ సభ (రైతు) మహాసభ విజయవాడలో జరిగింది. ఆ తరువాత కొద్ది నెలలకే ఆంధ్ర మహాసభ జరిగింది. ఈ మహాసభ తరువాత తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల రెండు చోట్ల చారిత్రాత్మక వీర తెలంగాణ విప్లవ పోరాటం సాగటానికి నాంది పలికింది. ఈ ఉద్యమాలన్నింటితోనూ పర్వ జీవితం పెనవేసుకుపోయింది.

పర్వ సత్యనారాయణ జీవితం కార్మికుడిగా ప్రారంభమయ్యింది. విప్లవం కోసం వృత్తిని వదిలి తెలంగాణ నైజాం రజాకార్ల దోపిడీని, దుర్మార్గాలను ఎదిరించి ప్రజలకు విముక్తి కల్పించటంలో అగ్ర భాగాన ఉన్నారు. దేశంలోకెల్లా భారీ బొగ్గు పరిశ్రమ సింగరేణిలో కార్మికులకు ఎనలేని సేవలు చేశారు. సిఐటియు ఏర్పడిన తరువాత రాష్ట్ర అధ్యక్షులుగా 1970 నుంచి 2002 వరకు సుదీర్ఘకాలం కొనసాగారు. 60వ దశకంలో కార్మిక వర్గంలో వచ్చిన మితవాద ధోరణులకు వ్యతిరేకంగా పట్టుదలగా పోరాడిన అగ్ర నాయకుల్లో పర్వ ఒకరు. ఆనాడు ఆంధ్ర రాష్ట్రంలో అత్యంత బలహీనంగా ఉన్న ఉద్యమం 1980 నాటికి ఒక దశాబ్దంలో ఇతర ట్రేడ్ యూనియన్లతో సమాన స్థాయికి తీసుకురావడంలో పర్వ, నండూరి కృషి మరువరానిది. కార్మికుల కింది స్థాయి వరకు వెళ్ళి కార్యకర్తలను గుర్తించి ఉద్యమాన్ని ఒక మలుపు తిప్పారు. పోస్టు కార్డు ముక్కతోనే కార్యకర్తలను నిత్యం ఉత్సాహపరిచేవారు. రాష్ట్రంలోని అన్ని పారిశ్రామిక కేంద్రాల్లో కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో అద్వితీయమైన కృషి చేశారు. సమరశీల పోరాటాలు నడిపారు. హైదరాబాద్, విశాఖ, విజయవాడ లాంటి కీలక ప్రాంతాల్లో కార్మికోద్యమాలకు ఓనమాలు దిద్ది కార్మిక సంఘాలను చైతన్యవంతంగా నడిపించారు.

ప్రచారంలో పర్వ దిట్ట. ప్రపంచ భూగోళం పాఠం చెప్పటంలో ఆయనకు మరెవరూ సరిలేరని చెప్పవచ్చు. ప్రపంచ యుద్ధాన్ని వర్ణించటం, సామ్రాజ్యవాదుల దుర్మార్గాలను ఎండగట్టడం, అతి సాధారణ కార్యకర్తలు కూడా అర్థం చేసుకునేలా చెప్పడం ఆయన ప్రత్యేకత. సాధారణ స్టడీ సర్కిళ్లను కూడా అంతే శ్రద్ధగా పాఠకులు అర్థం చేసుకునేటట్లు వివరించేవారు. 'కార్మిక లోకం' పత్రికలో ఆయన వ్యాసాలు, కథనాలకు ఒక ప్రత్యేకత ఉండేది. వ్యంగ్య రచన ఆయన సొంతం. కార్మిక వర్గానికి రాజకీయ చైతన్యం కల్పించటానికి నిరంతరం వెన్ను తట్టేవారు. వారి జీవిత అనుభవాలను ఆకళింపచేసుకొని కార్మిక ఉద్యమాలను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకు వెళ్ళవలసిన అవసరం ఎంతైనా ఉంది.

/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి /

సమస్య

సేఫ్టీ ఏదీ?

రోడ్డు, రైలు, ఆకాశ మార్గం...ఈ మూడింటిలో ఏది సురక్షితమైన ప్రయాణం అంటే? అందరూ రైలు ప్రయాణమే సురక్షితమని చెబుతారు. బొగ్గుతో నడిచే స్థాయి నుంచి బుల్లెట్ వేగంతో దూసుకుపోయే వేగంతో మన దేశ రైల్వే రంగం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంది. టెక్నాలజీలో ఇతర దేశాలతో పాటు సమానంగా ఎదిగాం–అని ఏలికలు గొప్పలు చెప్పుకుంటూ వుంటారు. అయితే ప్రయాణీకుల భద్రత ప్రాధాన్యతపై ఇప్పుడు సర్వత్రా సందేహాలు, ఆందోళనలు మొదలవుతున్నాయి. ఎందుకంటే జూన్ 2 శుక్రవారం సాయంత్రం ఒడిశాలో (బాలాసోర్) జరిగిన రైలు ప్రమాదం మన దేశ చరిత్రలోనే అత్యంత ప్రమాదకరమైనదని, విషాద సంఘటనని తెలుస్తోంది. ఒడిశా రైలు దుర్ఘటనలో మృతుల సంఖ్య 300కు సమీపంలో వుండడం కలవరపాటుకు గురిచేస్తోంది. సంఘటనపై రైల్వేశాఖ సమగ్ర దర్యాప్తు జరిపి నివేదికలు తప్పక అందజేస్తుంది. కానీ ఎవరూ తీర్చలేని, పూడ్చలేని భారీ ప్రమాదమనే చెప్పాలి. ఒక చిన్న తప్పిదం వల్లే భారీ ప్రమాదం జరిగిందని చెప్పాలి. టెక్నాలజీ ఇంత అభివృద్ధి చెందిన తరుణంలో ఇటువంటి భారీ నష్టం సంభవించడం ఎవరికీ మింగుడు పడ్డం లేదు. కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు మెయిన్ లైన్లో సిగ్నల్ వుండగా, లూప్‌లైన్ లోకి దూసుకుపోయి, ఆగివున్న గూడ్స్ రైలును ఢీకొట్టింది. ఆ సమయంలో గూడ్స్ రైలు అక్కడ ఎందుకు వుంది? గతంలో రైల్వేశాఖ చేసిన ప్రకటనకు ఈ ప్రమాదానికి పొంతన లేదనే చెప్పాలి. ఎందుకంటే ఒకే లైన్లో కొంత పరిధిలో పొరపాటున రెండు రైళ్లు వస్తే వాటికవే ఆగిపోతాయని గతంలో రైల్వేశాఖా మంత్రి కూడా ప్రకటించారు. కానీ గూడ్స్ రైలు ఆగివున్న లూప్ లైన్లోకి అతివేగంగా వెళ్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఎందుకు వెళ్లింది? ఈ ప్రమాదంలో పక్క ట్రాక్‌పై కోరమండల్ రైలు బోగీలు పడినప్పుడు, ఆ ట్రాక్‌పై వస్తున్న బెంగుళూరు–హౌరా ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురికావడం వల్ల మరింత నష్టం చేకూరింది. హౌరా ఎక్స్‌ప్రెస్ ట్రైన్ రాకుండా నిరోధించడంలో కూడా వ్యవస్థ విఫలమైందా? అనే సందేహాలు వినబడుతున్నాయి. వందల కోట్ల రూపాయల వ్యయంతో టెక్నాలజీని అభివృద్ధి చేస్తే... ఈ ప్రమాదంలో మృతులు, గాయపడిన వారి సంఖ్య వందల్లో వుండడమేమిటి? రైలు ప్రయాణీకుల్లో మరింత ఆత్మస్థైర్యం పెరిగేలా, భవిష్యత్తులో ఇటువంటి దురదృష్టకరమైన సంఘటనలు జరగకుండా టెక్నాలజీని వినియోగించుకోవాలని విజ్ఞులు సూచిస్తున్నారు. ఒడిశా ప్రమాదం మానవ తప్పిదమా? కాదా? అనేది విచారణలో తేలుతుంది. ఈ ఘటనకు సంబంధించి బాధిత కుటుంబాలకు ప్రభుత్వాలు ఎంత పరిహారం ఇచ్చినప్పటికీ పోయిన ప్రాణాలకు వెలకట్టలేం. కాకపోతే రైలు ప్రయాణం సురక్షితం అనే నమ్మకాన్ని తిరిగి తీసుకువచ్చేలా రైల్వే నిర్వహణ వుండాలన్నది ప్రతి ఒక్క ప్రయాణీకుడి అభిప్రాయం.

– దవరసింగి రాంబాబు

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

మూడు రైళ్లు ఎలా ఢీకొన్నాయంటే..!

భువనేశ్వర్ / న్యూఢిల్లీ : ఒడిశాలోని బాలాసోర్‌లో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న ప్రమాదంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. మూడు రైళ్లు ఒకేచోట ఒకదానికొకటి ఢీకొనడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ప్రత్యక్ష సాక్షులు, వివిధ వార్తా సంస్థల విశ్లేషణల ఆధారంగా ప్రమాదం జరిగిన తీరు ఈ విధంగా ఉంది. కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్ ఒక గూడ్స్ రైలును వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. రైల్వే పరిభాషలో దీన్ని 'హెడ్ ఆన్ కొలిజన్' అంటారు. ఇలాంటి ప్రమాదాలు చాలా అరుదుగా జరుగుతాయి. ఈ ప్రమాదంలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 12 బోగీలు పట్టాలు తప్పాయి. వీటిలో కొన్ని పక్కనున్న ట్రాక్‌పైకి దొర్లాయి. అదే సమయంలో ఆ ట్రాక్ మీద యశ్వంత్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్ వెళ్తోంది. పట్టాలు తప్పి పక్కనున్న ట్రాక్ మీదికి దొర్లిన కోరమండల్ ఎక్స్‌ప్రెస్ పెట్టెలు... అప్పుడే దానిపై వెళ్తున్న యశ్వంత్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్‌ను ఢీకొన్నాయి. దాంతో ఈ ప్రమాదం మరింత భయంకరంగా మారింది. ఈ ప్రమాదం సౌత్ ఈస్టర్న్ జోన్‌లోని ఖరగ్‌పూర్ డివిజన్ బ్రాడ్ గేజ్ నెట్‌వర్క్‌పైన జరిగింది.

ప్రమాదం జరిగిన క్రమం..

- శుక్రవారం, జూన్ 2న హౌరాకు దగ్గరలోని షాలీమార్ స్టేషన్ నుంచి రైలు నంబరు 12841 షాలీమార్-చెన్నై కోరమండల్ ఎక్స్‌ప్రెస్ నిర్ణీత సమయానికే బయలుదేరింది.
- 23 బోగీలు ఉండే ఈ రైలు అప్‌లైన్‌లో బాలాసోర్, కటక్, భువనేశ్వర్, విశాఖపట్నం, విజయవాడల మీదుగా చెన్నై చేరుకోవాలి.
- మధ్యాహ్నం 3 గంటల 20 నిమిషాలకు రైలు బయలుదేరింది. ముందుగా అది సంత్రాగాఛీ రైల్వేస్టేషన్‌లో ఆగింది. ఆ తర్వాత, కేవలం 3 నిమిషాల ఆలస్యంతో ఖరగ్‌పూర్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది.
- సాయంత్రం 5 గంటల 5 నిమిషాలకు ఈ రైలు ఖరగ్‌పూర్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరింది.
- సాయంత్రం 7 గంటల సమయంలో బాలాసోర్ దగ్గరుండే బాహానగా బజార్ రైల్వేస్టేషన్‌ను సమీపించింది.
- వాస్తవానికి బాహానగాలో ఈ రైలు ఆగదు. అయితే, అది ఈ స్టేషన్‌లో మెయిన్ లైన్ మీదుగా వెళ్లకుండా లూప్ లైన్ వైపు మళ్లింది. అప్పటికే సదరు లూప్ లైన్‌లో ఒక గూడ్స్ రైలు ఆగి ఉంది. చాలా వేగంగా వస్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్ గూడ్స్ ట్రెయిన్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. అయితే కోరమండల్ రైలు లూప్ లైన్ వైపు ఎందుకు మళ్లిందనేదీ అంతుచిక్కడం లేదు. ప్రాథమిక విచారణ ఆధారంగా సిగ్నలింగ్ వ్యవస్థ లోపమే ప్రధానకారణంగా కనిపిస్తోంది.
- గూడ్స్ రైలును కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు వెనుక నుంచి ఢీకొట్టడంతో 12 బోగీలు పట్టాలు తప్పాయి. ఇందులోని కొన్ని బోగీలు డౌన్ లైన్ మీదికి పడిపోయాయి.
- సరిగ్గా అదే సమయంలో యశ్వంత్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు ఈ ప్రమాద స్థలాన్ని దాటుతోంది. 22 బోగీలు ఉన్న ఆ రైలు దాదాపు 4 గంటలు ఆలస్యంగా నడుస్తోంది. ఈ రైలులోని చాలా భాగం ప్రమాద స్థలాన్ని దాటేసి ముందుకు వెళ్లింది.
- అప్పుడే కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురైంది. దాని బోగీలు కొన్ని పక్కకు దొర్లి యశ్వంత్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్ వెనుక భాగాన్ని ఢీకొట్టాయి. దాంతో ఆ ట్రెయిన్‌లో కూడా 3 బోగీలు పట్టాలు తప్పాయి.

శివ్ గోపాల్ మిశ్రా

శ్రీప్రకాశ్

రైల్వే నిపుణులేమన్నారు..

కోరమండల్, యశ్వంతపూర్ రైళ్ల ప్రమాదానికి సాంకేతిక వైఫల్యం, మానవ తప్పిదాలే ప్రధాన కారణాలుగా రైల్వే రంగ నిపుణులు విశ్లేషించారు. సాంకేతిక లోపం కారణంగానే కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ఉంటారని, లేదా సాంకేతిక లోపం వల్ల ఈ రైలు మెయిన్ లైన్ వదిలేసి లూప్ లైన్ మీదికి మళ్లి ఉండవచ్చునని అఖిల భారత రైల్వే మెన్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శివ్ గోపాల్ మిశ్రా తెలిపారు. అదే ఈ ప్రమాదానికి కారణమని పేర్కొన్నారు.

ప్రమాదం జరిగిన తీరును చూస్తుంటే, ఇదో భారీ మానవ తప్పిదం అయి ఉంటుందని రైల్వే బోర్డ్ మాజీ సభ్యులు (ట్రాఫిక్) శ్రీప్రకాశ్ పేర్కొన్నారు. "ఏదైనా రైలు ఒక ట్రాక్ మీద ఆగిపోతే, ఆ ట్రాక్ మీదికి మరో రైలు ఏదీ రాకుండా నిరోధించడానికి పాయింట్ రివర్స్ ఇస్తారు. అలా చేసినప్పుడు ఆ ట్రాక్ మీదికి మరేదీ వెళ్లదు. ఏదైనా సాంకేతిక లోపం వల్ల అలా జరగకపోతే, వెంటనే రెడ్ లైట్ సిగ్నల్ ఇస్తారు. అప్పుడు అటు నుంచి వచ్చే రైలు ఆగిపోతుంది." అని ఆయన అన్నారు.

వేగమే కొంపముంచిందా..

కాగా ప్రస్తుతం ప్రమాదం చోటుచేసుకున్న మార్గంలో రైళ్ల వేగాన్ని దాదాపు 15 రోజుల కిందే పెంచారని శివ్ గోపాల్ మిశ్రా తెలిపారు. గరిష్ట వేగాన్ని గంటకు 130 కిలోమీటర్లుగా నిర్ధరించారని ఆయన పేర్కొన్నారు. ప్రమాద సమయంలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ గంటకు దాదాపు 128 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తోందని, యశ్వంత్‌పూర్ ట్రెయిన్ దాదాపు 125 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తోందని ఆయన వివరించారు. ఈ వేగం కారణంగానే కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌కు భారీ నష్టం జరిగిందని తెలిపారు.

మరో గమనించాల్సిన అంశమేమిటంటే ఈ ప్రమాదానికి గురైన రెండు రైళ్లలోనూ జర్మనీలో డిజైన్ చేసిన 'లింకే హాఫ్‌మెన్ బుష్' (ఎల్‌హెచ్‌బి) బోగీలు ఉన్నాయి. ఈ డిజైన్ బోగీలు ప్రమాదాలను తట్టుకునేలా సురక్షితంగా ఉంటాయని చెబుతారు. కానీ రైళ్లకు చెందిన పాత ఐసిఎఫ్ డిజైన్‌తో పోలిస్తే, ఎల్‌హెచ్‌బి కోచ్‌లు ప్రమాదం జరిగినా ఒక దాని పైకి మరొకటి ఎక్కవు. కాబట్టి బోగీలు నుజ్జు నుజ్జయ్యే ప్రమాదం ఉండదు. దాంతో ప్రయాణికుల ప్రాణాలకు ముప్పుండదు.

కానీ ఒడిషా ప్రమాదానికి సంబంధించిన ఫొటోల్ని చూసినప్పుడు కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఇంజిన్ గూడ్స్ రైలు మీదికి ఎక్కినట్టు కనిపిస్తోంది. ఇంజిన్ వెనుకున్న చాలా బోగీలు ఒకదానితో ఒకటి ఢీకొని నుజ్జునుజ్జయ్యాయి. అందువల్ల ఈ ప్రమాదానికి దారితీసిన కారణాలు సమగ్ర దర్యాప్తు తర్వాతే తేటతెల్లం అవుతాయి.

మరుభూమిలా బాలాసోర్

భువనేశ్వర్ : తెల్లవారు జాము 2గంటల సమయం...బహనగ రైల్వే స్టేషన్ మరుభూమిని తలపిస్తోంది. బోగీల నుండి వెలికి తీసిన మృత దేహాలు అక్కడ గుట్టలుగా పడివున్నాయి. వాటిని ట్రక్కుల్లో తీసుకుని ఆ సమీపంలోని హైస్కూల్ ఆవరణలో వుంచారు. నేలపై నిర్జీవంగా పడి వున్న ఆ శవాల జేబుల్లోని మొబైల్ నిరంతరంగా మోగుతునే వున్నాయి. తమవారి ఆచూకీ తెలుసుకునేందుకు ఆత్మీయులు చేస్తున్న ఫోన్లతో ఆ ప్రాంతమంతా మారుమోగుతోంది. వరుసగా వస్తున్న బాధితుల ఆక్రందనలతో బాలాసోర్ జిల్లా ఆస్పత్రి, సోరో హాస్పిటల్‌లు కదన రంగాన్ని తలపించాయి. స్ట్రెచర్లపై, బయట కారిడార్లలో, గదుల్లో ఎక్కడ చూసినా క్షతగాత్రులే కనిపిస్తున్నారు. వారికి అవసరమైన చికిత్సలందిస్తూ డాక్టర్లు, నర్సులు అవిశ్రాంతంగా సేవలందిస్తున్నారు.

ప్రధాని మోడీ పరామర్శ

ప్రమాద స్థలిని ప్రధాని నరేంద్ర మోడీ శనివారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న సహాయక చర్యలను సమీక్షించారు. స్థానిక అధికారులు, విపత్తు సహాయక సిబ్బంది, రైల్వే అధికారులతో మాట్లాడి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. ఈ మహా విషాద సమయంలో యావత్ ప్రభుత్వం బాధితులకు అండగా వుంటుందని భరోసా ఇచ్చారు. అక్కడ నుండే కేబినెట్ సెక్రటరీ, ఆరోగ్య శాఖ మంత్రితో మాట్లాడారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల సాయం అందేలా చూడాల్సిందిగా ఆదేశించారు. అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు జరపాలని ఆదేశిస్తూ, దోషులెవరైనా వదిలిపెట్టేది లేదని చెప్పారు.

మనసును కలచివేసింది : నవీన్ పట్నాయక్

బాలాసోర్‌లోని జిల్లా హెడ్‌క్వార్టర్ ఆస్పత్రిని సందర్శించిన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైలు ప్రమాద ఘటన తనను ఎంతగానో కలచివేసిందన్నారు. సకాలంలో స్థానికులు స్పందించిన తీరును ప్రశంసిస్తూ వారికి కృతజ్ఞతలు చెప్పాలని అన్నారు. ఈ ప్రమాదం నేపథ్యంలో ఒక రోజు సంతాప దినాన్ని ప్రకటించారు.

సిగ్నల్ ఇచ్చారు కానీ...

భువనేశ్వర్ : కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌కి సిగ్నల్ ఇచ్చారని, కానీ వెంటనే వెనక్కి తీసుకున్నారని, ఈలోగా కోరమాండల్ లూప్‌లైన్‌లోకి ప్రవేశించి అక్కడ ఆగి వున్న గూడ్స్ రైలును ఢీ కొందని రైల్వే అధికారుల బృందం ప్రాధమిక దర్యాప్తులో తేలింది. సిగ్నల్ ఇచ్చి ఎందుకు వెనక్కి తీసుకున్నారన్న కారణాన్ని ఆ నివేదికలో స్పష్టం చేయలేదు. ఇదిలా వుండగా, సీనియర్ డిప్యూటీ కమర్షియల్ మేనేజర్, సౌత్ ఈస్ట్ రైల్వేస్ ప్రతినిధి రాజేష్ కుమార్ ప్రమాదం జరిగిన తీరును హిందూతో వివరిస్తూ, "లూప్ లైన్‌లో గూడ్స్ రైలు ఆగి వుంది. గంటకు 130కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్న కోరమాండల్ లూప్‌లైన్‌లోకి వెళ్ళి అక్కడ నిలిచిన గూడ్స్‌ను వెనక నుండి ఢీ కొట్టింది. మెయిన్ లైన్‌లో వెళ్ళేందుకు కోరమండల్‌కు సిగ్నల్ అప్పటికే ఇచ్చారు. అయినా కోరమాండల్ తన దిశ మార్చుకుని ఎందుకు లూప్‌లైన్‌లోకి వెళ్ళిందో తెలియడం లేదు." అని చెప్పారు. కోరమాండల్ ఇంజన్ మొత్తంగా గూడ్స్ రైలును పైకెత్తేసింది. దీంతో కోరమాండల్‌కి చెందిన 12బోగీలు పట్టాలు తప్పాయి, అదే సమయంలో ఎదురుగా వస్తున్న యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ అప్పటికే ప్రమాద స్థలిని దాటింది కానీ దాని చివరి రెండు జనరల్ బోగీలను కోరమాండల్ చివరి బోగీలు ఢీ కొన్నాయి. దీంతో ఆ జనరల్ బోగీలు దెబ్బతిన్నాయన్నారు.

రైల్వే మంత్రి రాజీనామా చేయాలి

- **ప్రతిపక్షాల డిమాండ్**

న్యూఢిల్లీ : భారతీయ రైల్వే చరిత్రలోనే అత్యంత ఘోరమైన దుర్ఘటనల్లో నాల్గవదిగా భావిస్తున్న ఈ ఘోర ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు శనివారం డిమాండ్ చేశాయి. ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నాయి. జరిగిన ఘోరంపై కాంగ్రెస్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేసింది. రైల్వే నిర్వహణలో ప్రయాణికుల భద్రతకే పెద్ద పీట వేయాల్సి వుందని పేర్కొంది. సిపిఎం(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపంకర్ భట్టాచార్య ట్వీట్ చేస్తూ, "భారతీయ రైల్వేలో మనకు సిగ్నలింగ్, భద్రతా వ్యవస్థలు లేవా ? లేదా ఇటువంటి మహా విషాదాలు ఇకపై దేశంలో రైల్వే ప్రయాణాల్లో సాధారణం కానున్నాయా? బాధితులకు, వారి కుటుంబాలకు మనం సమాధానం చెప్పాల్సి వుంది." అని పేర్కొన్నారు. రైల్వే మంత్రి రాజీనామా చేయాలని సిపిఐ, ఆర్‌జెడిలు డిమాండ్ చేశాయి. సవివరమైన రీతిలో దర్యాప్తు జరగాల్సి వుందని అన్నాడిఎంకె ప్రధాన కార్యదర్శి కె.పళనిసామి పేర్కొన్నారు. ప్రమాద స్థలిని సందర్శించిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అక్కడ రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో మాట్లాడుతూ ఈ ఘోర ప్రమాదం వెనుక ఏదో తప్పు జరిగిందని, దానిపై సక్రమంగా దర్యాప్తు జరగాలని కోరారు. ప్రమాదానికి గురైన బోగీల్లో మూడింటిని సోదా చేయలేదని విమర్శించారు.

సమగ్ర దర్యాప్తునకు సిపిఎం డిమాండ్

న్యూఢిల్లీ : ఇటీవల కాలంలో ఎన్నడూ లేని రీతిలో జరిగిన అత్యంత ఘోరమైన రైలు ప్రమాదంలో తమ ఆప్తులను కోల్పోయిన వారి కుటుంబాలకు సిపిఎం పొలిట్‌బ్యూరో తన ప్రగాఢ సానుభూతిని తెలియచేసింది. గాయపడిన వారికి సత్వరమే వైద్య సహాయం అందేలా చూడడం ద్వారా మృతుల సంఖ్య పెరగకుండా చూడాలని సంబంధిత అధికారులను పొలిట్‌బ్యూరో కోరింది. ఒడిషాలోని బాలాసోర్ జిల్లాలో బహనాగా రైల్వే స్టేషన్‌కు సమీపంలో మూడు రైళ్ళు ఢీ కొన్న ప్రమాదానికి కారణాలేమిటో ఇదమిత్థంగా తేలాలంటే దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. రైల్వే భద్రతకు సంబంధించి తలెత్తిన తీవ్రమైన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, మోడీ ప్రభుత్వం చేపట్టే ఆధునీకరణ ప్రణాళికల్లో దీన్ని ఎంత మాత్రమూ విస్మరించరాదని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

సహాయక చర్యల్లో సిపిఎం

రైల్వే వ్యవస్థను రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని సిపిఎం ఒడిశా రాష్ట్ర కార్యదర్శి ఆలీ కిశోర్ పట్నాయక్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం 'ప్రజాశక్తి'తో ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ.. బాధితులను పరామర్శిస్తూ సహాయక చర్యల్లో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నిమగ్నమయ్యారని తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్స్ కొనసాగుతున్నాయన్నారు. మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు, క్షతగాత్రులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఘటనా స్థలంలో రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణోవ్

ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశం

భువనేశ్వర్ : ఒడిషా దుర్ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణోవ్ శనివారం ఆదేశించారు. సౌత్ ఈస్టర్న్ సర్కిల్ రైల్వే భద్రతా కమిషనర్ నేతృత్వంలో ఈ దర్యాప్తు సాగుతుందని తెలిపారు. కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ పరిధిలో రైల్వే భద్రతా కమిషనర్ కార్యాలయం పనిచేస్తుంది.

33 రైళ్ళ రద్దు

శుక్రవారం ఒడిషా ప్రమాదంతో మొత్తంగా 33 రైళ్ళను పూర్తిగా రద్దు చేసినట్లు నైరుతి రైల్వే శనివారం ప్రకటించింది. కాగా మరికొన్ని రైళ్ళను పాక్షికంగా రద్దు చేయగా, మరికొన్నింటిని దారి మళ్ళించారు. ప్రమాద స్థలిలో చిక్కుకుపోయిన ప్రయాణికులను తీసుకెళ్ళిన రెండు రైళ్ళు శనివారం హౌరా చేరుకున్నాయి.

కవచ్ ఆ రూట్‌లో లేదు

ప్రమాదం జరిగిన మార్గంలో రైళ్ల ఢీకొనకుండా నివారించే వ్యవస్థ 'కవచ్' అందుబాటులో లేదని రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. లోకో పైలట్ సిగ్నల్‌ను విస్మరించినపుడు కవచ్ వ్యవస్థ పైలట్‌ను అప్రమత్తం చేస్తుంది, బ్రేక్‌లను పూర్తిగా అదుపులోకి తీసుకుని రైలు కదలికలను నిలిపివేస్తుంది.

పరిమళించిన మానవత్వం

బాలాసోర్ : ఒడిశాలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర విషాదం వేళ మానవత్వం పరిమళించింది. బహనగ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు నిమిషాల వ్యవధిలోనే వేలాదిగా ప్రమాదస్థలికి తరలివచ్చి సహాయక చర్యల్లో నిమగ్నయ్యారు. రైలు శకలాల నుంచి క్షతగాత్రులను వెలికితీసి సహాయక బలగాలకు తోడ్పాడునందించారు. వందలాది మందికి ప్రాణం పోశారు. అక్కడి స్థానికులు క్షతగాత్రుల కులం, మతం, లింగం, భాష, ప్రాంతీయతను చూడలేదు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే పరమావధిగా భావించి లౌకికతత్వ సమ భావనను సమున్నత స్థాయిలో నిలిపారు. ఒక్క బాలాసోర్ జిల్లా ఆసుపత్రి, సోరో ఆసుపత్రి క్షతగాత్రులతో నిండిపోయాయి. బాలాసోర్ జిల్లా ఆసుప్రతిలో శనివారం మధ్యాహ్నానికి 526 మంది క్షతగ్రాతులు చేరారు. అక్కడి వైద్యులకు ఏం చేయాలో తోచలేదు. రక్తమోడుతున్న బాధితులకు శస్త్ర చికిత్స చేయడానికి అవసరమైన రక్తం ఎక్కడి నుంచి తేవాలో తెలియక తలలు పట్టుకున్న సమయంలో స్థానికులే ఆపద్బాంధవులుగా ముందుకొచ్చారు. దాదాపు రెండు వేల మంది యువకులు రక్తం దానం చేసేందుకు ఆసుపత్రులకు పరుగులు తీశారు.

రక్తదానం చేసేందుకు తరలివచ్చిన యువత

రక్తదానం చేసి ఆపదలో అసలైన హీరోలుగా నిలిచారు. రక్తదానికి తరలివచ్చిన స్థానిక యువతకు జిల్లా అదనపు వైద్యాధికారి (ఎడిఎంఒ) అభినందించారు. వైద్యవృత్తిలో తాను మూడు దశాబ్దాలుగా ఉంటున్నా ఇంతటి ఘోర కలి ఎన్నడూ చూడలేదని, 251 మంది ఒకేసారి రక్తమోడుతూ ఆసుపత్రికి వస్తే ఏం చేయాలో తోచలేదన్నారు. అయితే వైద్య సహచరులు, నర్సులు నిర్విరామంగా పనిచేసి బాధితులకు చికిత్స అందిస్తున్నారని తెలిపారు. కానీ స్థానిక యువత, పోలీసులు రక్తదానం చేసేందుకు తరలిరావడం ఎంతో ఊరటనిచ్చిందన్నారు. దాదాపు 500 మంది యువత నుంచి రక్తం సేకరించామన్నారు. మానవత్వం చాటిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కాలం చెల్లిన దేశద్రోహ చట్టాన్ని రద్దు చేయాలి

- **సిపిఎం డిమాండ్**

న్యూఢిల్లీ : భారతీయ శిక్షా స్మృతిలోని దేశద్రోహం నిబంధనను సరిదిద్దేందుకు లా కమిషన్ చేసిన సిఫార్సులు అంగీకార యోగ్యంగా లేకపోవడమే కాదు, పైగా సుప్రీం కోర్టు వ్యాఖ్యలను అవి తోసిపుచ్చుతున్నాయని సిపిఎం పొలిట్‌బ్యూరో శనివారం నాడు ఒక ప్రకటనలో పేర్కొంది. కాలం చెల్లిన ఈ చట్టాన్ని శాసన పుస్తకాల నుండి తొలగించేందుకు తగు చట్టపరమైన చర్యలు కేంద్ర ప్రభుత్వం తీసుకునేంతవరకు దేశద్రోహ చట్టం అమలును నిలిపివేస్తూ సుప్రీం కోర్టు ఇప్పటికే ఉత్తర్వులిచ్చింది. న్యాయ కమిషన్ మాత్రం కనీస జైలు శిక్షను గతంలోని మూడు సంవత్సరాల నుండి ఏడేళ్ళకు పెంచడం ద్వారా దేశద్రోహ చట్ట నిబంధనలకు మరిన్ని కోరలు తొడగాలని నిశ్చయించుకున్నట్టుగా ఉంది. ప్రతిపక్ష పార్టీల నేతలను లక్ష్యంగా చేసుకుని ఇడి, సిబిఐలను దారుణంగా దుర్వినియోగపరుస్తున్న నేపథ్యంలో ఈ సిఫార్సులు వినాశాన్ని కలుగచేస్తాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది. కాబట్టి కాలం చెల్లిన దేశద్రోహ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామని ఆ ప్రకటనలో పొలిట్‌బ్యూరో పేర్కొంది.

బహుళ ధ్రువ ప్రపంచానికి భరోసా

- **బ్రిక్స్ కూటమిలోకి మరిన్ని దేశాలు**
- **బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశం పిలుపు**

జోహాన్నెస్‌బర్గ్ : ప్రపంచ వ్యవస్థను తిరిగి సమతుల్యం చేయాలని బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రులు పిలుపిచ్చారు. "ప్రపంచం బహుళ ధృవంగా వుండాలి, తిరిగి సమతుల్యతను పొందాలి, కొత్తగా తలెత్తే పరిస్థితులను పాత పద్ధతులు పరిష్కరించలేవన్న బలమైన సందేశాన్ని మన సమావేశం పంపాలి." అని భారత విదేశాంగ మంత్రి జై శంకర్ తన ప్రారంభోపన్యాసంలో పేర్కొన్నారు. 'మార్పుకు మనం చిహ్నం, దానికి అనుగుణంగానే వ్యవహరించాలి.' అని ఆయన అన్నారు. ఆర్థిక శక్తి సామర్థ్యాలు ఒకే చోట కేంద్రీకృతమై పోవడం వల్ల చాలా దేశాలు కేవలం కొద్ది దేశాల దయా దాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తున్నాయని అన్నారు.

బ్రిక్స్ మంత్రులు చర్చించిందేమిటి

అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికా డాలర్లకు ప్రత్యామ్నాయ కరెన్సీలను ఉపయోగించే అవకాశాలపై బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రులు చర్చించారు. బ్రిక్స్ కొత్త డెవలప్‌మెంట్ బ్యాంక్‌ను బలోపేతం చేయడంపై కూడా వారు చర్చించారు. అలాగే అంతర్జాతీయ నిర్ణయాక క్రమాన్ని సంస్కరించడంపై కూడా వారు చర్చలు జరిపారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో ఆఫ్రికాకు శాశ్వత ప్రాతినిధ్యం లేకపోవడంపై దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి నలేది పాండర్ విమర్శించారు.

బ్రిక్స్‌ను విస్తరిస్తారా ?

డజనుకుపైగా దేశాలు బ్రిక్స్ గ్రూపులో చేరడానికి ఆసక్తి కనబరుస్తున్నాయని రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్ తెలిపారు. అయితే చమురు ఉత్పత్తి దేశాలైన సౌదీ అరేబియా, ఇరాన్, యుఎఇలను సభ్య దేశాలుగా చేర్చుకుని బ్రిక్స్ గ్రూపును విస్తరించేందుకు అవకాశం వుంది. దీనిపై కేప్‌టౌన్‌లోనే వున్న సౌదీ విదేశాంగ మంత్రితో చర్చించామని లావ్‌రోవ్ తెలిపారు. కొత్త సభ్యులతో గ్రూపు విస్తృతమవుతుందని ఆశిస్తున్నట్లు చైనా విదేశాంగ మంత్రి మా ఝూవు తెలిపారు. మనది మరింత పెద్ద కుటుంబం అవుతుందని వ్యాఖ్యానించారు.

ఆగస్టులో బ్రిక్స్ సదస్సుకు పుతిన్ హాజరవుతారా ?

ఆగస్టులో బ్రిక్స్ సదస్సు జరగనుంది. దీనికి రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ఆహ్వానించారు. అయితే, పుతిన్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఐసిసి) అరెస్టు వారంటు జారీ చేసింది. దక్షిణాఫ్రికా ఐసిసిలో సభ్య దేశమైనందున, ఐసిసితో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు పుతిన్‌ను దక్షిణాఫ్రికా అరెస్టు చేయాల్సి వుంటుంది. దీనిపై తమకు గల చట్టపరమైన అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి పాండర్ చెప్పారు. కాగా పుతిన్ ఈ సదస్సుకు హాజరువుతానని ఇంతవరకు ధృవీకరించలేదు. అయితే తగు స్థాయిలో రష్యా ప్రాతినిధ్యం వుంటుందని మాత్రమే క్రెమ్లిన్ చెప్పింది.

బ్రిజ్ భూషణ్ వేధింపులు వాస్తవమే

(మొదటి పేజీ తరువాయి)

సందర్శించి సాక్ష్యాలను సేకరించి వాంగ్మూలాలను నమోదు చేశారు. ఇప్పటివరకు. వారు 125 మంది వ్యక్తుల వాంగ్మూలాలను నమోదు చేశారు. వారిలో నలుగురు తమ వాంగ్మూలాలలో ముగ్గురు మహిళా రెజ్లర్ల ఆరోపణలను ధ్రువీకరించారు' అని ఒక అధికారి తెలిపారు.

ఎఫ్ఐఆర్‌ల నమోదు తరువాత బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను సిట్ రెండుసార్లు ప్రశ్నించింది. ఈ రెండు సందర్భాల్లో, అతను తన ప్రమేయాన్ని తిరస్కరించాడని, తనను తప్పుగా ఇరికించారని పేర్కొన్నారు. రెజ్లర్లు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో పేరున్న డబ్ల్యుఎఫ్ఐ కార్యదర్శి వినోద్ తోమర్‌ను కూడా సిట్ మూడు నుంచి నాలుగు గంటలపాటు ప్రశ్నించింది. 'ఇప్పటి వరకు మొత్తం ఆరుగురు మహిళా రెజ్లర్లు, ఒక మైనర్ తమ ఫిర్యాదుల్లో చేసిన ఆరోపణలను ధ్రువీకరించిన క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి) సెక్షన్ 164 కింద మెజిస్ట్రేట్ ముందు వారి వాంగ్మూలాలను నమోదు చేశారు' అని ఒక అధికారి తెలిపారు.

నడ్డాకు రెండుసార్లు తెలిపా : చౌదరి బీరేంద్ర సింగ్

బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలంటూ దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్లు నిరసనకు నాయకత్వం వహిస్తున్న విషయంపై తాను పార్టీ జాతీయ అధ్యక్షులు జెపి నడ్డాను రెండుసార్లు కలిశానని హర్యానా బిజెపి సీనియర్ నాయకులు చౌదరి బీరేంద్ర సింగ్ తెలిపారు. మొదటి నరేంద్ర మోడీ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన చౌదరి బీరేంద్ర సింగ్, నడ్డాతో ఫోన్‌లో మాట్లాడుతూ 'ప్రజల మనోభావాలు మల్లయోధుల వద్ద ఉన్నాయని, బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్య తీసుకోకపోవడం వెనుక బిజెపికి ఏదైనా రాజకీయ లెక్కలు ఉంటే, అది నష్టం జరుగుతుంది' అని అన్నారు. వినేష్ ఫోగట్, బజరంగ్ పునియా, సాక్షి మాలిక్ నేతృత్వంలోని రెజ్లర్లకు అనుకూలంగా మాట్లాడిన హర్యానాకు చెందిన అతికొద్ది మంది బిజెపి నాయకుల్లో ఆయన ఒకరు. మిగిలిన ఇద్దరు హర్యానా బిజెపి చీఫ్ ఒపి ధంకర్, రాష్ట్ర హోం, ఆరోగ్యశాఖ మంత్రి అనిల్ విజ్ కూడా ఉన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలి : ఎస్‌కెఎం

పోక్సో చట్టాన్ని సవరించాలంటూ బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ చేసిన ప్రకటనలను సంయుక్త కిసాన్ మోర్చా తీవ్రంగా ఖండించింది. ఆయనను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేసింది.

ఫారం ఎ
బహిరంగ ప్రకటన

(రెగ్యులేషన్ 6 ఆఫ్ ది దివాలా మరియు దివాలాబోర్డ్ ఆఫ్ ఇండియా (ఇన్‌సాల్వెన్సీ రీసొల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పోరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్) రెగ్యులేషన్స్, 2016)

మెస్సర్స్. ఇడి అండ్ టెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ క్రెడిటార్ల దృష్టికి

సంబంధిత వివరాలు		
1.	కార్పోరేట్ రుణగ్రహీత పేరు	మెసెర్స్ ఇడి అండ్ టెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్
2.	కార్పోరేట్ రుణగ్రహీత యొక్క విలీనం తేది	12/05/1997
3.	అధికారం కార్పోరేట్ రుణగ్రహీత క్రింద విలీనం/ నమోదు చేయబడింది	రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్ఓసి)-విజయవాడ
4.	కార్పోరేట్ రుణగ్రహీత యొక్క కార్పోరేట్ ఐడెంటిటీ నంబర్/లిమిటెడ్ లయబిలిటీ ఐటెంటీఫికేషన్ నం.	L72200AP1997PLC027073
5.	కార్పోరేట్ రుణగ్రత యొక్క నమోదిత కార్యాలయం మరియు ప్రధాన కార్యాలయం (ఏదైనా) యొక్క చిరునామా	ఫ్లాట్ నం.104 లుంబిని ఎన్‌క్లేవ్, పంజాగుట్ట హైదరాబాద్ ఎపి 500072 లో
6.	కార్పోరేట్ రుణగ్రతకి సంబంధించి దివాలా ప్రారంభమైన తేది	25.05.2023 (02.06.2023న ఆర్డర్ కాపీ అందుబాటులో ఉంటుంది)
7.	దివాలా తీర్మానం ప్రక్రియ మూసివేసే అంచనా తేది	20-11-2023
8.	వృత్తిసంబంధమైన తీర్మానం మధ్యంతరంగా వ్యవహరించే వృత్తిసంబంధమైన దివాలా యొక్క పేరు మరియు నమోదు సంఖ్య	ముమ్మనేని వజ్ర లక్ష్మి IBBI/IPA-001/IP-P00919/2017-2018/11526
9.	బోర్డ్‌తో నమోదుకాబడిన మధ్యంతర వృత్తిసంబంధమైన తీర్మానం యొక్క చిరునామా మరియు ఇ-మెయిల్	ఫ్లాట్ నం.107, వి.వి.వింటేజ్ రెసిడెన్సీ, సోమాజీగూడ, హైదరాబాద్-500082 Email id: emailtolak@gmail.com and edtechcirp@gmail.com
10.	మధ్యంతర వృత్తిసంబంధమైన తీర్మానంతో ఉత్తర ప్రత్యుత్తరాలకు ఉపయోగించుటకు చిరునామా మరియు ఇ-మెయిల్	ఫ్లాట్ నం.107, వి.వి.వింటేజ్ రెసిడెన్సీ, సోమాజీగూడ, హైదరాబాద్-500082 Email id: emailtolak@gmail.com and edtechcirp@gmail.com
11.	దావాలు దాఖలు చేయుటకు చివరి తేది	17-06-2023
12.	రుణదాతల తరగతులు, ఏవైనా, మధ్యంతర తీర్మానం వృత్తిసంబంధమైన వాటి ద్వారా తెలిసినవి, సెక్షన్ 21 యొక్క సబ్-సెక్షన్ (6ఎ) యొక్క క్లాస్ (బి) క్రింద	ఎకౌంట్ పుస్తకాల వెరిఫికేషన్ పై గుర్తిస్తుంది
13.	క్లాస్‌లో రుణదాతల యొక్క అధీకృత ప్రతినిధిగా వ్యవహరించి దివాలా నిపుణులుగా గుర్తించిన పేర్లు (ప్రతి తరగతి కొరకు మూడు పేర్లు)	ప్రస్తుతం వర్తించదు
14.	(ఎ) సంబంధిత ఫారాలు (బి) అధీకృత ప్రతినిధుల వివరాలు ప్రతినిధులు లభ్యమయ్యేది:	Weblink:https://www.ibbi.gov.in/home/downloads భౌతిక చిరునామా: వర్తించదు

నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్, 25.05.2023న (02.06.2023న ఆర్డర్ కాపీ అందుబాటులో ఉంచబడింది) కార్పొరేట్ డెబ్టార్ మెసెర్స్ ఇడి అండ్ టెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ యొక్క కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రెజల్యూషన్ ప్రాసెస్‌ను ప్రారంభించాలని ఆదేశించినట్లు నోటీసు ఇవ్వబడింది.
మెసెర్స్ ఇడి అండ్ టెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ రుణదాతలను ఇక్కడ పిలువడమేమనగా ఎంట్రీ నం. 10కి ఎదురుగా ఉండి చిరునామాగా పేర్కొన్న ఇంటెరిమ్ రెజల్యూషన్ ప్రొఫెషనల్‌కు 17.06.2023న లేదా ముందే వారి దావాల రుజువులను దాఖలు చేయుటకు కోరడమైనది.
ఆర్థిక రుణదాతలు తమ క్లెయిమ్‌లను ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా మాత్రమే రుజువుతో సమర్పించాలి.
క్లాస్‌కి చెందిన ఇతర ఫైనాన్షియల్ రుణదాతలు వ్యక్తిగతంగా ఎంట్రీ నం.12, ఎంట్రీ నం.13 కు వ్యతిరేకంగా జాబితా చేయబడిన ముగ్గురు దివాలా నిపుణుల నుండి అధీకృత ప్రతినిధిని దాని ఎంపికను సూచించాలి. సిఎ ఫారమ్‌లో తరగతికి అధీకృత ప్రతినిధిగా వ్యవహరించడానికి (తరగతిని పేర్కొనండి)- వర్తించదు.
క్లెయిమ్ యొక్క తప్పుడు లేదా తప్పుదారి పట్టించే రుజువులను సమర్పిస్తే జరిమానాలు విధించబడతాయి.

తేది: 03.06.2023
ప్రదేశం : హైదరాబాద్.

ముమ్మనేని వజ్రలక్ష్మి, ఇంటరిమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్
ఫోన్ : 9848448727

SWARNA SECURITIES LIMITED

CIN: L52520AP1990PLC011031 Regd. Off: 27-1-102, II Floor, Swarnalok Complex, Governorpet, Eluru Road, Vijayawada – 520 002, AP. Phone: +91-0866-2575928, E-Mail: swarnasecurities@rediffmail.com Website: https://www.swarnasecurities.com

33వ వార్షిక జనరల్ మీటింగ్ (ఎజిఎమ్) నోటీసు
ఇ-ఓటింగ్ సౌకర్యం మరియు బుక్ క్లోజర్ సమాచారం

కంపెనీ 33వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఎజిఎం) ఎమ్ హోటల్, డో.నం.54-15-3, శ్రీనగర్ కాలనీ, రింగురోడ్డు, విజయవాడ-8 వద్ద 30 జూన్, 2023న శుక్రవారం ఉ.11.00గం.లకు నిర్వహించబడునని కంపెనీ సభ్యులకు ఈ నోటీసు ద్వారా తెలియచేయటమైనది.
ఎజిఎమ్ నోటీసు మరియు దాని వివరణాత్మక ప్రకటన, ఎఫ్.వై. 2022-23 వార్షిక నివేదికతో పాటు సభ్యులకు ఇ-మెయిల్ చేయబడుతుంది మరియు కంపెనీ వెబ్‌సైట్ లో https://www.swarnasecurities.com/, సిడిఎస్ఎల్ ఇ-ఓటింగ్ వెబ్‌సైట్: https://www.evotingindia.com/noticeResults.jspand స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్: https://www.bseindia.com కూడా అందుబాటులో ఉంచబడుతుంది.
కంపెనీల చట్టం, 2013 యొక్క వర్తించే నిబంధనలకు అనుగుణంగా, దాని క్రింద చేసిన నియమాలు మరియు సెబి (లిస్టింగ్ బాధ్యతలు మరియు బహిర్గతం అవసరాలు) నిబంధనలు, 2015 ప్రకారం, కంపెనీ ఎజిఎమ్‌కి ముందు రిమోట్ ఇ-ఓటింగ్ సదుపాయాన్ని అలాగే ఈ సమయంలో ఎజిఎమ్ ఇ-ఓటింగ్ సదుపాయాన్ని అందిస్తోంది. దిగువ ఇవ్వబడిన క్యాలెండర్ ప్రకారం సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ (సిడిఎస్ఎల్) అందించిన రిమోట్ ఇ-ఓటింగ్ ప్లాట్‌ఫారమ్‌ను ఉపయోగించి సభ్యులు తమ ఓటు వేయవచ్చు:

1.	సభ్యులు ఓటు వేయడానికి కటాఫ్ తేదీ (కటాఫ్‌డేట్‌గా రికార్డ్‌లో ఉన్న సభ్యులు ఎజిఎమ్ సమయంలో రిమోట్ ఇ-ఓటింగ్ మరియు ఓటింగ్ ద్వారా తమ ఓట్లను వేయడానికి అర్హులు)	23 జూన్, 2023 శుక్రవారం
2.	రిమోట్ ఇ-ఓటింగ్ ప్రారంభం	27 జూన్, 2023, ఉ.9.00గం. (ఐఎస్‌టి)
3.	రిమోట్ ఇ ఓటింగ్ ముగింపు	29 జూన్, 2023, సా.05.00 గం. (ఐఎస్‌టి)
4.	ఎజిఎమ్ సమయం మరియు ఇ-ఓటింగ్ తేది కొరకు ప్రారంభ సమయం	30 జూన్, 2023 ఉ.11.00గం. (ఐఎస్‌టి)
5.	ఎజిఎమ్ రోజు, తేది మరియు సమయం	శుక్రవారం, 30 జూన్, 2023 ఉ.11.00గం. (ఐఎస్‌టి)
6.	ఇ-ఎజిఎమ్ మరియు ఇ-ఓటింగ్ ప్లాట్‌ఫారం కొరకు సర్వీస్ ప్రొవైడర్	సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ (సిడిఎస్ఎల్)
7.	ఇ-ఓటింగ్ కొరకు సర్వీస్ ప్రొవైడర్ (సిడిఎస్ఎల్) యొక్క వెబ్‌సైట్	www.evotingindia.com
8.	బుక్ క్లోజర్ తేదీలు	24.06.2023 నుండి 30.06.2023 వరకు (రెండు రోజులు కలుపుకొని)
9.	ఇ-ఓటింగ్ సదుపాయానికి సంబంధించి ఫిర్యాదులను పరిష్కరించడానికి బాధ్యత వహించే వ్యక్తి పేరు, హోదా, ఇ మెయిల్ ఐడి మరియు ఫోన్ నం.	శ్రీ. అనిల్ కుమార్ కంపెనీ సెక్రటరీ మరియు సమ్మతి అధికారి స్వర్ణ సెక్యూరిటీస్ లిమిటెడ్ Tel: +91-0866-2575928 email: swarnasecurities@rediffmail.com సెంట్రల్ డిపోజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్. Tel: 1800225533; email: helpdesk.evoting@cdslindia.com

కంపెనీ / ఆర్‌టిఎ లేదా డిపాజిటరీ పార్టిసిపెంట్‌లతో వారి ఇమెయిల్ చిరునామాలు, బ్యాంక్ వివరాలు మరియు మొబైల్ నంబర్ మొదలైనవాటిని నమోదు చేసుకోని/నవీకరించని సభ్యులు సంబంధిత డిపాజిటరీ పార్టిసిపెంట్‌లతో లేదా భౌతికంగా "ఆర్తి కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్." (కంపెనీ యొక్క ఆర్‌టిఎ) లో నమోదు చేసుకోవాలని దీని ద్వారా అభ్యర్థించబడ్డారు. ఎజిఎమ్‌కి ముందు రిమోట్-ఓటింగ్ సిస్టమ్ ద్వారా లేదా ఎజిఎమ్ సమయంలో ఇ-ఓటింగ్ ద్వారా లింక్ ని ఉపయోగించడం. రిమోట్ ఇ-ఓటింగ్ మరియు ఇ-ఓటింగ్ పై వివరణాత్మక ప్రక్రియ కొరకు సభ్యులు ఎజిఎమ్ నోటీసును సూచించవచ్చు.

గమనిక:
1. ఎజిఎమ్‌లో రిమోట్ ఇ-ఓటింగ్ మరియు ఇ-ఓటింగ్ ద్వారా ఎలక్ట్రానిక్ పద్ధతిలో తమ ఓటును వినియోగించుకునే సౌకర్యాన్ని కంపెనీ తన సభ్యులకు అందిస్తుంది. అన్నీ వ్యాపారాలు ఎజిఎమ్‌కి ముందు రిమోట్ ఇ-ఓటింగ్ మరియు ఎజిఎమ్ సమయంలో ఇ-ఓటింగ్ ద్వారా మాత్రమే లావాదేవీలు జరపాలి.
2. సభ్యుల రిజిస్టర్‌లో లేదా డిపాజిటరీల ద్వారా నిర్వహించబడే లబ్ధిదారుల యజమానుల రిజిస్టర్‌లో పేరు నమోదు చేయబడిన సభ్యులు మాత్రమే రిమోట్ ఇ-ఓటింగ్ లేదా ఇ-ఓటింగ్ ద్వారా ఓటు వేయడానికి అర్హులు.
3. ఒక సభ్యుడు రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా అతని/ఆమె/వారి ఓటు హక్కును వినియోగించుకున్న తర్వాత కూడా ఎజిఎమ్‌లో పాల్గొనవచ్చు కానీ ఎజిఎమ్‌లో మళ్లీ ఓటు వేయడానికి అనుమతించబడరు.

బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల ఆర్డర్ ద్వారా
For Swarna Securities Limited,
సం/- ఎమ్. మురళీకృష్ణ
ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్
DIN: 01889812

ప్రదేశం : విజయవాడ
తేది: 03.06.2023

ఖుషి ఖుషీగా ...

నా పేరు ఖుషి. నేను 6వ తరగతి చదువుతున్నా. మా నాన్నగారు డిఫెన్స్‌లో (ఇండియన్ ఎయిర్ ఫోర్స్) సర్వీస్ చేయడం వల్ల మా ఫ్యామిలీ ఎప్పుడూ మా సొంత ఊరుకు వచ్చే అవకాశం ఉండేది కాదు. ఈ సంవత్సరం ఆ అవకాశం దొరికింది. ఇక్కడికి వచ్చిన తర్వాత ఎన్ని సంవత్సరాలు మేము ఎన్ని మిస్ అయ్యామో తెలిసింది. అబ్బ, జేజి (గ్రాండ్ పేరెంట్స్) మా మీద చూపించే శ్రద్ధ, ప్రేమ ఇంటి చుట్టుపక్కల అత్త - మామ, అక్క - బావ, అన్న - తమ్ముడు, అవ్వ - తాత అంటూ వరుసలతో పిలిచే పలకరింపులు .. నాకు ఎంతో కొత్తగా, ఇష్టంగా అనిపించింది. వీధిలో ఉండే పిల్లలతో ఆడే ఆటలు కొత్తగా ఉన్నాయి. చాలా సరదాగా అనిపించాయి. స్కూలు, ట్యూషన్, స్పెషల్ క్లాస్ అనే ప్రపంచం నుండి పల్లెటూర్లలో ఆటలు ఆడుకుంటుంటే ఖుషీగా ఉంది. తోటి పిల్లల మాటలు, కబుర్లు వింతగా అనిపించాయి. వారితో కలిసి ఈతకు వెళ్లా. అక్కడ బాగా కేకలు వేసి కేరింతలతో మరో ప్రపంచానికి వచ్చామా అన్నంతగా ఉంది. ఈ సంవత్సరం సెలవులు నాకు తీపి జ్ఞాపకాల్లా మిగులుతాయి.

- మల్లు ఖుషాల్ రెడ్డి,
ఎర్రగుంట్ల, కడప జిల్లా.

- అర్జున్,చైత్ర
నల్గొండ.

- బి. కార్తికేయ,
చీడికాడ మండలం,
అనకాపల్లి జిల్లా

కూచిపూడి నేర్చుకుంటున్నా..

హాయ్ ఫ్రెండ్స్,

ఈ సెలవుల్లో ప్రతి రోజూ రెండు గంటల సేపు కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్నా. పృధ్వి మాస్టారు దగ్గరుండి ఎలా స్టెప్స్ వేయాలో బాగా నేర్పిస్తున్నారు. దేవాలయాల కార్యక్రమాలలో కూడా కూచిపూడి నృత్యంతో పాటు కోలాటం కూడా ప్రదర్శనలు ఇస్తున్నాం. మొన్న జరిగిన ఒంటిమిట్ట కోదండ రాముని కళ్యాణంలో కూడా ప్రదర్శన చేశాం. మా నృత్యాన్ని చూసిన ప్రజలు మెచ్చుకుంటుంటే ఎంతో గర్వంగా ఉంది. ప్రజల మన్ననలు పొందే విధంగా కూచిపూడి నేర్పించిన పృథ్వీ మాస్టారుకు కృతజ్ఞతలు.

- వై. టి. రిచితా రెడ్డి
8వ తరగతి, ఎర్రగుంట్ల,
కడప జిల్లా.



బొమ్మరిల్లు

- జ్యోతి,
8వ తరగతి,
జెడ్‌పిహెచ్ స్కూలు, నున్న,
విజయవాడ, కృష్ణాజిల్లా.

- కిన్నెర హరప్రీత్ నందన్ కుమార్,
3వ తరగతి, ఎంపిపి స్కూలు,
సిద్ధన కొండూరు, కలిగిరి మండలం.
నెల్లూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

దీపాలక్ష్మి సాధారణ గృహిణి. చెన్నై నుంగంబక్కంలో నివసిస్తోంది. కుటుంబ బాధ్యతల్లో తలమునకలై క్షణం తీరిక లేకుండా గడుపుతోంది. కానీ, ఆమె చదువుకునే రోజుల్లో చురుకైన విద్యార్థిని. పరీక్షల్లో ఎప్పుడూ టాప్ మార్కులే స్కోరు చేసేది. అయితే తనకు వచ్చిన పరిజ్ఞానాన్ని ఇతరులకు చెప్పేటప్పుడు మాత్రం తడబడేది. ఒకింత బెరుకు, భయం ఆమెను వెంటాడేవి. జువాలజీలో డిగ్రీ పట్టా పుచ్చుకున్నా పెళ్లి, పిల్లలతో కాలం గడుపుతోంది. ఇలాంటి మహిళలకు తోడుగా నిలిచింది శ్రద్ధా మాను ఫౌండేషన్. వారి ప్రతిభను ఉపయోగంలోకి తెస్తోంది.

అర్హత ఉండీ అవకాశం లేని ఆ మహిళల కోసం ...

దీపాలక్ష్మి మాదిరే జయచిత్ర పోలీస్ కానిస్టేబుల్ శిక్షణలో ఉత్తీర్ణత సాధించింది. కానీ పెళ్లి తరువాత ఉద్యోగం వద్దన్న అత్తింటి ఆంక్షలతో ఇంటికే పరిమితమైంది. ఇలా మనచుట్టూ ఎంతోమంది మహిళలు విద్యలో బాగా రాణించి, డిగ్రీ పట్టా పుచ్చుకుని కూడా ఇంటికే పరిమితమై ఉంటారు.

ఇంగ్లీషు పేపరు చదువుతూ..

ఇప్పుడు అటువంటి వారంతా తమిళనాడులోని శ్రద్ధా మాను ఫౌండేషన్ తరపున నిర్వహించే ఓ బృహత్తర ప్రాజెక్టులో భాగమై మొట్టమొదటిసారి తమ డిగ్రీ పట్టాలకు అర్హమైన ఉద్యోగంలో భర్తలతో సమానంగా ఆర్జిస్తున్నారు. ఇది వారు ఊహించనిది. కాని ఇది సాధ్యమయ్యేలా చేశారు ఫౌండేషన్ నిర్వాహకురాలు మధుమతి నారాయణ్. 'సాధారణంగా ఇంటి పనులు చేసుకునే మహిళలను ఆ ఇంటివారు చాలా తక్కువగా చూస్తారు. పిల్లలు, భర్త, కుటుంబ బాధ్యతలతో సతమతమయ్యే వారంతా ఎంతో నైపుణ్యం కలవారని నాకు తెలిసేలా చేసింది మా ఇంటి సహాయకురాలు రమ్య. ఒకరోజు ఒక చేతిలో చీపురు, మరో చేత్తో ఇంగ్లీషు న్యూస్‌పేపరుతో రమ్య నాకు కనిపించింది. చెత్త వేయడానికి ఆ పేపరు వాడుతున్నావా.. నేను ఇంకా దాన్ని చదవలేదు. అక్కడ పెట్టు అని గట్టిగా చెప్పాను. కాని ఆమె 'నేను కూడా దీన్ని చదువుతున్నాను మేడమ్. ఈ ఆర్టికల్ చాలా బాగా రాశారు. అందుకే పని మధ్యలో చదువుతున్నాను' అని చెప్పింది. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ప్రశ్నార్థకంగా చూస్తున్న నాతో 'నేను పోస్టుగ్రాడ్యుయేట్ చేశాను మేడమ్' అని చెప్పింది. ఆ సంఘటన నాలో ఎన్నో ఆలోచనలకు దారితీసింది. అప్పటి నుండి నా ఇంటి చుట్టుపక్కల ఉన్న గృహిణులను గమనించడం ప్రారంభించాను. డిగ్రీ పట్టాలు పుచ్చుకున్న ఎంతోమంది మహిళలు అమ్మలుగా, భార్యలుగా, అత్తింటి సేవలో తీరికలేకుండా గడుపుతున్నారు. వారి భర్తలు కనీసం ప్రాథమిక విద్య కూడా చదివి లేరు. రోజు కూలీకి వెళ్లే ఆ పురుషులు ఇంటి యజమానులుగా, ఈ మహిళలు వారి కనుసన్నల్లో మగ్గుతున్నారు. తమలో టాలెంట్ ఉన్నా దాన్ని గుర్తించని వ్యక్తుల మధ్య నిత్యం అవమానాలతో కాలం వెళ్లదీస్తున్నారు. వారి శక్తిసామర్థ్యాలు గుర్తించి, తమ కాళ్లపై తాము నిలబడే భరోసా కల్పించాలని ఆ క్షణమే నిర్ణయించుకున్నాను' అంటూ చెబుతున్నారు మధుమిత.

'బడి తరువాత'లో

బీజం పడింది..

'బడి తరువాత' అనే ప్రోగ్రామ్‌ని ఫౌండేషన్ చాలా కాలంగా నిర్వహిస్తోంది. ప్రాథమిక అభ్యసనంతో పాటు పిల్లల అభిజ్ఞా, నైతిక, భావోద్వేగ, ఊహాత్మక, సామాజిక సామర్థ్యాలను వెలికితీయడమే లక్ష్యంగా ఈ ప్రోగ్రామ్ నడుస్తుంది. అమెరికాకు చెందిన హార్వర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్, సైకాలజిస్ట్ రూపొందించిన బహుళ మేథస్సు అభ్యసన కేంద్రంగా ఇది పనిచేస్తోంది. 2022-23 ఏడాదిలో 732 మంది విద్యార్థులు ఈ ప్రోగ్రామ్‌లో భాగస్వామ్యులయ్యారు. వచ్చే ఏడాదికి 2 వేల పైచిలుకు పిల్లలను భాగస్వామ్యులను చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు.

'ఉపాసన' బతుకు దారి చూపింది..

'పూర్తికాలం పనిచేసే టీచర్లు లేక 2019 ఏడాదిలో మా ప్రోగ్రామ్ నత్తనడకన సాగింది. విధుల్లో ఉన్న టీచర్లే 'బడి తరువాత' బాధ్యత తీసుకోవడం వల్ల వారిపై ఒత్తిడి పెరిగి ఈ ప్రోగ్రామ్ నుండి బయటికి వెళ్లిపోయారు. అప్పుడే నాకు ఈ టాలెంట్ గృహిణులు గుర్తుకువచ్చారు. అర్హత ఉండీ, అవకాశం లేక ప్రోత్సాహం కరువైన ఎంతోమంది ఈ మహిళలనే టీచర్లుగా తయారుచేయాలనుకున్నాను. 'ఉపాసన' పేరుతో టీచర్ శిక్షణా తరగతులను మొదలుపెట్టాం. ఆరు నెలల కాలపరిమితితో ఉచిత శిక్షణ ఇప్పించాం. ఆన్‌లైన్‌లో క్లాసులు నిర్వహించడం, కొన్ని ప్రత్యేక తరగతుల పిల్లలకు ఈ ట్రైనీ టీచర్లతో స్థానిక పాఠశాలల్లో పాఠాలు చెప్పించాం. శిక్షణ పూర్తయిన మహిళల్లో కొంతమంది ప్రోగ్రామ్‌తో సంబంధం లేకుండా సొంతంగా ఉపాధి అవకాశాలు పొందారు. అప్పుడు నాకు చాలా సంతోషమేసింది. నా లక్ష్యం అదే. ఆ మహిళలు ఇంటి నుండి బయటికి వచ్చారు. ఇప్పుడు వారికి ఓ ప్రత్యేక గౌరవం ఉంది. అలా మా 'ఉపాసన'లో శిక్షణ తీసుకున్న మహిళలు తొలిసారి వారి డిగ్రీ పట్టాలతో ఉపాధి పొందారు' అని సంతోషంగా చెబుతారు మధుమిత.

నా భర్త బహుమతలు ఇస్తున్నారు..

'నేను బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ చేశాను. తమిళ మీడియంలో చదవడం వల్ల ఇంగ్లీషు రాక అవకాశాలు రాలేదు. 'ఉపాసన'లో చేరి ఇంగ్లీషుపై పట్టు సాధించాను. నాపై నాకు నమ్మకం ఏర్పడింది. ఆ శిక్షణ ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో ప్రభుత్వ స్కూల్లో ఉద్యోగం సాధించాను. ఇప్పుడు నా ఇంట్లో నన్ను చాలా బాగా ప్రోత్సహిస్తున్నారు. నా భర్త నా కోసం బహుమతులు తెస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. ఇది నేను ఊహించనిది' అని చెన్నై కొదంబక్కమ్ ప్రభుత్వపాఠశాల్లో విధులు నిర్వహిస్తున్న గాయత్రి టీచర్ చెబుతున్నారు. ప్రతి ఇంట్లో ఇటువంటి మహిళలు ఎందరో ఉంటారు. అర్హత ఉండీ అవకాశాలు లేని వారందరికీ తగిన ప్రోత్సాహమివ్వాలి. వారి శక్తి సామర్థ్యాలను గుర్తించి ఆత్మస్థైర్యాన్ని నింపాలి.

భారత హాకీజట్టుకు మరో విజయం

షూటౌట్‌లో బ్రిటన్‌పై 4-2తో గెలుపు ● 7న నెదర్లాండ్స్‌తో ఢీ

లండన్: ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ హాకీలో భారత హాకీజట్టు మరో విజయాన్ని సొంతం చేసుకుంది. రెండో లీగ్ ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో భాగంగా శనివారం బ్రిటన్‌తో తలపడిన భారత్ షూటౌట్‌లో 4-2గోల్స్ తేడాతో గెలిచింది. నిర్ణీత సమయం ముగిసే సరికి ఇరుజట్లు 4-4గోల్స్‌తో సమంగా నిలిచాయి. ఈ గెలుపులో భారత్‌కు ఒక బోనస్ పాయింట్ కూడా లభించింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్(7వ ని.), మన్‌దీప్ సింగ్(19వ ని.), సుఖ్‌జీర్ సింగ్(28వ ని.)అభిషేక్(50వ ని.)లో ఒక్కో గోల్ కొట్టారు. ఇక బ్రిటన్ తరఫున సామ్‌వర్డ్ (8వ, 40వ, 47వ, 53వ ని.)లో నాలుగు గోల్స్ కొట్టి ఆతిథ్య జట్టును ఆదుకున్నాడు. శుక్రవారం బెల్జియంపై 5-1గోల్స్ గెలిచిన భారత్.. తొలి లీగ్‌లో బ్రిటన్ చేతిలో 2-4గోల్స్ తేడాతో ఓటమిపాలైంది. ఇక షూటౌట్‌లో భారత్ తరఫున మన్‌ప్రీత్, హర్మన్‌ప్రీత్, లలిత్, అభిషేక్ గోల్స్ చేశారు. ఇక బ్రిటన్ తరఫున విల్ కాల్నాన్.. మరో గోల్‌ను రోపర్స్ కొట్టాడు. దీంతో భారత్ ఈ లీగ్‌లో 12మ్యాచుల్లో 24పాయింట్లతో రెండోస్థానంలో ఉండగా.. బ్రిటన్ 11మ్యాచుల్లో 26పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో భాగంగా యూరప్‌లో జూన్ 7న నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లు ఆడేందుకు బయల్దేరి వెళ్లనుంది.

ప్రి క్వార్టర్స్‌కు స్వైటెక్, స్విటోలినా, సబలెంకా

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌సామ్ టోర్నీ మహిళల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లో టాప్‌సీడ్, పోలండ్‌కు చెందిన ఇగా స్వైటెక్‌తోపాటు స్విటోలినా, సబలెంకా ప్రవేశించారు. శనివారం జరిగిన మూడోరౌండ్ పోటీలో ఇగా స్వైటెక్ 6-0, 6-0తో వాంగ్(చైనా)పై సునాయాసంగా గెలుపొందగా.. స్విటోలినా 2-6, 6-2, 7-5తో స్ట్రాస్టబర్గ(ఉక్రెయిన్)పై పోరాడి నెగ్గింది. బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంకా 6-2, 6-2తో రష్యాకు చెందిన కమిల్లాపై నెగ్గి ప్రి క్వార్టర్స్‌కు చేరారు.

రూనే సునాయాసంగా.. రూఢ్ పోరాడి..

పురుషుల సింగిల్స్ మూడోరౌండ్ పోటీలో 6వ రూనే(డెన్మార్క్) సునాయాసంగా గెలుపొందగా.. 4వ సీడ్ కాస్పర్ రూఢ్(నార్వే) చెమటోడ్చి నెగ్గారు. మూడోరౌండ్‌లో రూనే 6-4, 6-1, 6-3తో వోలివేరి(అర్జెంటీనా)పై గెలుపొందగా.. రూఢ్ 4-6, 6-4, 6-1, 6-4తో జంగ్(చైనా)పై గెలిచాడు.

ఏకైక టెస్ట్‌లో ఇంగ్లండ్ గెలుపు

లండన్: ఐర్లాండ్‌తో జరిగిన ఏకైక టెస్ట్‌లో ఇంగ్లండ్ జట్టు 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఐర్లాండ్ నిర్దేశించిన 12పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ వికెట్లేమీ కోల్పోకుండా ఛేదించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ పోప్‌కు లభించింది. శనివారం మూడోరోజు ఆటను కొనసాగించిన ఐర్లాండ్ 362పరుగులు ఆలౌటైంది.

ఐర్లాండ్ : 172, 362/9
ఇంగ్లండ్ : 524/4, 12/0

సెమీస్‌లో ఓడిన లక్ష్యసేన్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ పోరాటం ముగిసింది. లక్ష్యసేన్ సెమీస్‌లో ఓటమిపాలయ్యాడు. శుక్రవారం జరిగిన సెమీస్ పోటీలో లక్ష్యసేన్ 21-13, 17-21, 13-21తో విటిడ్‌శరణ్(థాయ్‌లాండ్) చేతిలో పోరాడి ఓడాడు. తొలి గేమ్‌ను సునాయాసంగా నెగ్గిన లక్ష్యసేన్.. రెండో గేమ్‌లో ప్రత్యర్థిగా గట్టి పోటీనిచ్చాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో విటిడ్‌శరణ్ తొలినుంచే లక్ష్యసేన్‌పై ఒత్తిడి పెంచాడు. దీంతో ఆ గేమ్‌లో లక్ష్యసేన్ పుంజుకోలేకపోయి ఓటమిని చవిచూశాడు.

బాలాసోర్ రైలు విపత్తుపై
ప్రపంచ దేశాల నేతల విచారం

బాలాసోర్: ఒడిషా రైలు ప్రమాదం పట్ల పలువురు ప్రపంచ నేతలు విచారం వ్యక్తం చేశారు. చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, జపాన్ ప్రధాని ఫ్యుమియో కిషిదా, కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడెయు, నేపాల్ ప్రధాని ప్రచండ, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఈ మేరకు సంతాప సందేశాలు పంపించారు. పుతిన్, రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, ప్రధాని మోడీకి సంతాపాన్ని తెలియచేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సమయంలో భారత్‌కు అండగా వుంటామని వారు ప్రకటించారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ అధ్యక్షులు కసాబా కోరొసి కూడా తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

రైలు ప్రమాదంపై సినీ ప్రముఖుల దిగ్భ్రాంతి

శుక్రవారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ ఘోర రైలు ప్రమాదంలో ఇప్పటివరకూ 278 మంది మృతి చెందగా 900 మందికి పైగా గాయపడిన సంగతి తెలిసిందే. ఈ పెనువిషాదంలో మరణించిన వారికి సినీనటీనటులు మహేష్‌బాబు, జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్, కళ్యాణ్‌రామ్, నాని, రష్మిక, నభా నటాషా తదితర నటీనటులు మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటిస్తూ సానుభూతి వ్యక్తం చేశారు.

రైలు ప్రమాద దుర్ఘటన గురించి తెలుసుకుని దిగ్భ్రాంతికి గురయ్యాను. మృతుల కుటుంబాల గురించే చింతిస్తున్నాను. ప్రస్తుతం క్షతగాత్రుల ప్రాణాలను కాపాడటానికి రక్తం ఎంతో అవసరం. కాబట్టి పరిసర ప్రాంతాల్లో ఉన్న అభిమానులందరూ దయచేసి రక్తదానానికి ముందుకు రావాలని కోరుతున్నాను.

- చిరంజీవి

ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం గురించి విని నా హృదయం ముక్కలైంది. ఈ ప్రమాదంలో ప్రాణాలను కోల్పోయిన వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. క్షతగాత్రులు త్వరితగతిన కోలుకోవాలి.

- అల్లు అర్జున్

ఇలాంటి ఘోర ప్రమాదం చోటుచేసుకోవడం చాలా బాధాకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. అలాగే క్షతగాత్రులు వెంటనే కోలుకోవాలి.

- సల్మాన్ ఖాన్

రైలు ప్రమాద ఘటన హృదయాన్ని కలచివేసింది. నా బాధను మాటల్లో చెప్పలేకపోతున్నా. క్షతగాత్రులు కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా. రెస్క్యూ ఆపరేషన్‌లో సాయం చేయడానికి ముందుకు వచ్చిన స్థానికులకు ధన్యవాదాలు.

- యశ్

బావురుమన్న బాలాసోర్

చెల్లాచెదురైన బోగీలు, సహాయక చర్యల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు

విజయవాడకు శనివారం రాత్రి చేరుకున్న ప్రయాణికులకు సహాయం చేస్తున్న సిపిఎం కార్పొరేటర్ సత్యబాబు, కార్యకర్తలు

మృతదేహాల వద్ద దీనంగా...

ఘటన వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్

రైలు బోగీల విడిభాగాలను క్రేన్‌తో తొలగిస్తున్న సహాయక బృందాలు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68